www.prajaswaramdaily.com

# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 298 | పేజీలు : 5 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | సోమవారం 08-07-2024

MHR TV
www. mhrtv.com




## ఈటల.. కమలంలో ఇమడలేకపోతున్నారా?

- బీజేపీ అధిష్టానం ప్రాధాన్యం ఇవ్వడం లేదా..?
- బీఆర్ఎస్ లో కీలకంగా వ్యవహరించిన పరిస్థితి
- ప్రస్తుతం మల్కాజిగిరి ఎంపీగా గెలిచినా దక్కని గుర్తింపు
- కేంద్ర క్యాబినెట్‌లో లభించని బెర్తు
- రాష్ట్ర అధ్యక్ష పదవిపై ఆశలు
- రేసులో అరుణ, ధర్మపురి
- తన రాజకీయ భవిష్యత్తుపై అంతర్మథనం

**హైదరాబాద్, జూలై 7, (ప్రజాస్వరం) :** ఈటల రాజేందర్ మావోయిస్టు ఉద్యమాల నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర మంత్రి అయ్యారు. బీఆర్ఎస్ లో ఉద్యమకాలం నుంచి పనిచేసి కేసీఆర్ కు చేదోడు వాదోడుగా నిలిచారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించక ముందు కూడా కేసీఆర్ ఈటల రాజేందర్ కు ప్రయారిటీ ఇచ్చారు. శాసనసభలో పార్టీ నేతగా అవకాశం కల్పించారు. అలా ఈటల రాజకీయ ప్రస్థానం మొదలయింది. 2014లో బీఆర్ఎస్ లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈటల రాజేందర్ పార్టీలో, ప్రభుత్వంలోనూ కీలకంగా మారారు. ఆయన బీసీ వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో పాటు ఉద్యమం నుంచి రావడం, మంచి వాగ్దాటి ఉండటంతో ఆయనకు అవకాశాలు అనుకోకుండానే వచ్చాయంటారు. అయితే 2018లో రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈటల రాజేందర్ కు, కేసీఆర్ కు మధ్య గ్యాప్ పెరిగింది. పార్టీ నాయకత్వంపైనే నెగిటివ్ కామెంట్స్ చేయడం మొదలుపెట్టారు. దీంతో ఈటల రాజేందర్ ను మంత్రి వర్గం నుంచి కేసీఆర్ తప్పించారు. వెనువెంటనే పార్టీ పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన ఈటల అప్పుడు జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించారు. ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ లోనూ నెంబర్ వన్ పొజిషన్ లో ఉండాలన్నది ఈటల రాజేందర్ కోరిక లా ఉంది. అయితే ఆ పార్టీలో ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవాళ్లు, కింది స్థాయి నుంచి పైకి వచ్చిన నేతలు అనేక మంది ఉన్నారు. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్ నుంచి రెండుచోట్ల పోటీ చేసిన ఈటల రాజేందర్ ఓటమిపాలయ్యారు. దీంతో ఆయన తిరిగి పదవిలో ఉండేందుకు లోక్ సభ ఎన్నికలు వచ్చాయి. ఆయన కోరుకున్నట్లుగానే మల్కాజ్ గిరి నియోజకవర్గం అభ్యర్థిగా పార్టీ ఎంపిక చేసింది. అప్పటి వరకూ ఉన్న నేతలను పక్కన పెట్టి అధినాయకత్వం ఆయనకు టిక్కెట్ ఇచ్చింది. మొత్తం మీద ఈటల రాజేందర్ మల్కాజ్ గిరి నియోజకవర్గం మిగతా 2 లో..

- గత ప్రభుత్వ హయాంలో పదేండ్లు కొనసాగిన హరితహారం
- రాష్ట్ర వ్యాప్తంగా 292 కోట్ల మొక్కలు నాటినట్లు రికార్డుల్లో నమోదు
- రూ.11,747 కోట్లు ఖర్చు పెట్టినట్లు అధికారిక లెక్కలు
- ఆశించిన ఫలితాలు రాలేదని భావిస్తున్న కాంగ్రెస్ సర్కార్
- నిధులు దుర్వినియోగం అయినట్లు అనుమానం..
- ప్రధానంగా కీలక నేతల నియోజకవర్గాలపై నజర్
- విచారణకు కమిటీ వేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం..



## మొక్కల లెక్కల్లో గోల్‌మాల్

**హైదరాబాద్, జూలై 7, (ప్రజాస్వరం):** తెలంగాణ ప్రభుత్వం హరితహారం పేరు మారుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి ఏటా వర్షాకాల ఆరంభంలో చేపట్టే ఈ మొక్కలు నాటే కార్యక్రమం బీఆర్ఎస్ హయాంలో హరితహారంగా రూపాంతరం చెందింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పాత ఆనవాళ్లను తొలగించే ప్రక్రియలో భాగంగా ఈ పథకానికి ఒకప్పుడు ప్రారంభంలో పెట్టిన పేరునే కొనసాగించే ప్రక్రియ చేపట్టింది. .2015-16 నుంచి తొమ్మిది విడతలుగా చేపట్టిన 'తెలంగాణకు హరితహారం' పథకం కింద ఇప్పటి వరకు 292 కోట్ల మొక్కలు నాటినట్లు, రూ.11,747 కోట్ల ఖర్చు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్న నేపథ్యంలో వ్యయానికి అనుగుణంగా ఫలితాలు రాలేదనే అనుమానాలను సీఎం రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రి వ్యక్తం చేసినట్టు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు హరితహారం పథకంలో నిధుల దుర్వినియోగం జరిగినట్టు భావిస్తున్నారు. నాటిన మొక్కలకు రెండింతలు రికార్డుల్లో నమోదు చేయడం, ఆ తర్వాత ఆ మొక్కలు చనిపోయాయని పేర్కొంటూ మళ్లీ మొక్కలు నాటినట్లు చూపడం వంటివి జరిగాయని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా నిధుల దుర్వినియోగంపై కమిటీ వేద్దామని ఆమె ఈ సందర్భంగా ప్రతిపాదించినట్లు తెలిసింది. దీనికి సీఎం స్పందించి వందల కోట్ల మొక్కలు నాటినట్లు గణాంకాలున్నాయని, ఆ స్థాయిలో పచ్చదనం పెరగలేదని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు వన మహోత్సవం పేరుతోనే పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించేవారు. 1950 లో ఈ కార్యక్రమం ప్రారంభం కాగా..ఈ సంవత్సరం 75 సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంలో తాజాగా ఈ కార్యక్రమానికి 'వజ్రోత్సవం వనమహోత్సవం' గా నిర్వహించనుంది. పనిలో పనిగా గత పదేళ్లుగా మాజీ సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కొంత మందికి హరిత ఆహారంగా మారింది. హరిత హారం కార్యక్రమంలో నిధులను కైంకర్యం చేసి మొక్కుబడిగా హరిత కార్యక్రమం నిర్వర్తించి అందినకాడికి నిధులు దోచుకున్నవారిపై కాంగ్రెస్ సర్కార్ నజర్ పెట్టనుంది. ఇందులో భాగంగా ఇప్పటికే కొన్ని అంశాల్లో కమిటీ వేసి విచారణ జరిపిస్తోంది. మరికొన్ని వాటిపై ప్రణాళికలు మిగతా 2 లో..




## చివరి దశకు స్మార్ట్ సిటీ

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.936 కోట్ల అభివృద్ధి పనులు
- జూన్ 30 తో ముగిసిన ప్రాజెక్టు గడువు
- ఆరేండ్లలో 80శాతం పనులు పూర్తి
- మరో తొమ్మిది నెలలు పొడిగించిన కేంద్రం
- అందుబాటులోకి రానున్న మరిన్ని సౌకర్యాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న కరీంనగర్ వాసులు



## 'సోషల్' ఫైట్..

- ఎన్డీఏ వ్యూహాన్ని అనుసరిస్తున్న 'ఇండియా'
- సోషల్ మీడియాపై ప్రత్యేక ఫోకస్
- కొద్ది రోజులుగా 'యాక్టివ్ మోడ్'
- బీజేపీ వైఫల్యాలపై ఎప్పటికప్పుడు పోస్టులు
- 2029 ఎన్నికల నాటికి మరింత బలహీనపరిచేలా ప్రణాళికలు
- భవిష్యత్తులో నష్టం జరగొచ్చని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం

**హైదరాబాద్, జూలై 7, (ప్రజాస్వరం):** దేశంలో 18వ లోక్ సభ ఎన్నికలు ముగిశాయి. వరుసగా మూడోసారి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడింది. మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే విపక్ష ఇండియా కూటమి అధికార ఎన్డీఏపై యుద్ధం మొదలు పెట్టింది. వాస్తవానికి ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ ఎంపీ సీట్లు తగ్గాయి, అదే సమయంలో కాంగ్రెస్ సీట్లు పెరిగాయి. ఇండియా కూటమి బలం పుంజుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల నాటికి బీజేపీని మరింత బలహీన పర్చడమే లక్ష్యంగా ఇండియా కూటమి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. బీజేపీకి బలంగా భావించే సోషల్ మీడియానే ఇప్పుడు ఇండియా కూటమి వేదికగా చేసుకుంది. సైలెంట్ గా కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం మొదలు పెట్టింది. ఇటీవల ఐఆర్ సీటీసీ కొత్త నిబంధనలు అంటూ విస్తృతంగా ప్రచారం చేసింది. వ్యక్తిగత ఖాతా ఉన్నవారు ఇతరులకు టికెట్ బుకింగ్ చేస్తే జైలుకు వెళ్తారని సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేశారు. అయితే దీనిపై రైల్వే శాఖ వివరణ ఇచ్చుకుంది. ఇందులో వాస్తవం లేదని, తప్పుడు వార్తలు నమ్మొద్దని సూచించింది. కానీ, అప్పటికే ప్రజల్లో కేంద్రంపై ఆగ్రహం వ్యక్తమైంది. ఇక సోషల్ మీడియా వేదికగానే జీఎస్టీపైనా ప్రచారం మొదలు పెట్టారు. గతంలో కూడా అనేక రకాల పన్నులు ఉండేవి. కానీ, కేంద్రం ఈ పన్నులన్నీ కలిసి జీఎస్టీ పేరుతో ఒకే గాటికి తెచ్చింది. దేశవ్యాప్తంగా ఒకే మిగతా 2 లో..

## మోదీ వర్సెస్ సంఘ్

- సార్వత్రిక ఎన్నికల తర్వాత మారుతున్న పరిణామాలు
- పూర్తి మెజారిటీ రాకపోవడంతో నరేంద్ర మోదీకి సవాళ్లు
- ప్రధాని ఏకపక్ష నిర్ణయాలపై ఆర్ఎస్ఎస్ అసహనం
- జాతీయ అధ్యక్షుడి ఎంపికపై కోల్డ్ వార్
- బీజేపీ విధానాలపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సైతం విమర్శలు


**న్యూఢిల్లీ, జూలై 7 :** సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత జాతీయ రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. బీజేపీకి క్లీన్ మెజారిటీ రాకపోవడం, ప్రభుత్వ ఏర్పాటులో మిత్ర పక్షాలపై ఆధార పడటంతో అడుగడుగునా ప్రధాని మోదీకి సవాళ్ల ఎదురవుతున్నాయి. గతంలో మోదీని గ్లోబల్ లీడర్ గా ప్రమోట్ చేసిన ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలే ఆయనకు ఇప్పుడు ఇబ్బందికరంగా మారుతున్నారన్న వార్తలు పెరుగుతున్నాయి. గతంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్న మోదీ, అమిత్ షా ఎన్డీఏ 3.0లో అలాంటి పరిస్థితి లేదు. ప్రభుత్వ నిర్ణయాలే కాదు.. పార్టీలో కూడా ప్రధాని మాట ఏకపక్షంగా జరిగే అవకాశం లేదు.ప్రస్తుతం బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డానే మోదీ తన కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకున్నారు. దీంతో.. బీజేపీ కొత్త సారథిని ఎన్నుకునే పనిలో పడింది. ఈ విషయంలోనే మోదీ, ఆర్ఎస్ఎస్ మధ్య కోల్డ్ వార్ నడుస్తోందనే ప్రచారం ఢిల్లీ వర్గాల్లో నడుస్తోంది.

మోదీ ఏకపక్ష నిర్ణయాలకు చెక్ పెట్టేలా, వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యం అనే సంకేతాలను పంపేందుకు రాజ్ నాథ్ సింగ్ లేదా శివరాజ్ సింగ్ చౌహాన్ పేరును ఆర్ఎస్ఎస్ పరిశీలిస్తోంది. కానీ, మోదీ మాత్రం సునీల్ బన్సాలీ లేదా మహారాష్ట్రకు చెందిన వినోద్ తావ్డేకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని చూస్తున్నారు.ప్రభుత్వం, పార్టీలో ఏక పక్ష నిర్ణయాలు ఉండకుండా చేయాలంటే మోదీ కంటే సీనియర్లు అయిన రాజ్ నాథ్ సింగ్ లేదా శివరాజ్ సింగ్ చౌహాన్ ను అధ్యక్షుడిగా నియమించాలని ఆర్ఎస్ఎస్ పట్టుబడుతోంది. అవసరమైతే వీరిద్దరూ మోదీ నిర్ణయాలను వ్యతిరేకించేంత బలం ఉన్న నాయకులు. పార్టీలో స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటారని ఆర్ఎస్ఎస్ ఆలోచన. అయితే, మోదీ, అమిత్ షా మాత్రం వీళ్లద్దరికి పార్టీ బాధ్యతలు ఇవ్వకూడదని ఆలోచిస్తున్నారు. మోదీకి శివరాజ్ సింగ్ చౌహాన్ పోటీ అవుతారనే మొన్నటి ఎన్నికల్లో మధ్యప్రదేశ్ లో బీజేపీ భారీ



మెజార్టీతో గెలిచినా..ఆయనకు సీఎం పగ్గాలు ఇవ్వకుండా కొత్తవారిని తీసుకొచ్చారు. ఇక రాజ్ నాథ్ సింగ్ గత పదేళ్లుగా కేంద్ర కేబినెట్లో ఉన్నప్పటికీ.. మోదీ, అమిత్ షా కంటే తక్కువ పోర్టు ఫోలియో ఉన్న శాఖలను ఇస్తున్నారు. ఇలా వీరిద్దరినీ మోదీ తొక్కి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, మొన్నటి ఎన్నికల్లో బీజేపీ గ్రాఫ్ ఘోరంగా పడిపోవడంతో ఆర్ఎస్ఎస్ రూపంలో మోదీకి ఎదురు గాలి వీస్తోంది. జాతీయ అధ్యక్షుడి విషయంలోనే కాకుండా తెలంగాణ పార్టీ బాధ్యతల విషయంలోనూ, మిగతా 2 లో..

# చివరి దశకు స్మార్ట్ సిటీ



- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.936 కోట్ల అభివద్ధి పనులు
- జూన్ 30 తో ముగిసిన ప్రాజెక్టు గడువు
- మరో తొమ్మిది నెలలు పొడిగించిన కేంద్ర ప్రభుత్వం
- ఆరేండ్లలో 80శాతం పనులు పూర్తి
- అందుబాటులోకి రానున్న మరిన్ని సౌకర్యాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న నగర వాసులు

**కరీంనగర్, జూలై 3, (ప్రజాస్వరం) :** కరీంనగర్ స్మార్ట్ సిటీ పనులు అధికారుల అలసత్వం పాలకుల పట్టింపు లేని ధోరణితో వ్యవహరించడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కరీంనగర్ పట్టణాన్ని కేంద్ర ప్రభుత్వం 2017 జూలై 31న స్మార్ట్ సిటీగా ఎంపిక చేసింది.కేంద్ర, రాష్ట్ర - ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.936 కోట్లు కేటాయించారు. 2018లో పనులు ప్రారంభించారు. ఇప్పటివరకు సుమారు రూ.745 కోట్లు చెల్లింపులు కాగా, మరో రూ.191 కోట్లు విడుదల కావాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం రూ.30కోట్లు విడుదల చేయగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.30 కోట్లు కలిపి రూ.60 కోట్లు నగరానికి విడుదల చేయాల్సి ఉంది. ఆరేళ్ళ లో 80 శాతం పనులు పూర్తి చేశారు. ఇంకా 20 శాతం పనులు పూర్తి కావాలంటే మరెన్ని సంవత్సరాలు పడుతుందో అని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు. స్మార్ట్ సిటీ పనులు రాబోయే 2025 మార్చిలోగా పూర్తి చేయాలని కేంద్రం వెసులు బాటు కల్పించింది. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ గడువు జూన్30 తో ముగియగా, ఈ గడువును మరో తొమ్మిది నెలలు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గడువు పొడిగింపుతో వందశాతం పనులు పూర్తి చేసే పనిలో అధికారులు పాలకులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు, కూడళ్లు, పార్క్ లు సమీకృత మార్కెట్లు, దోభీఘాట్లు, కమాండ్ కంట్రోల్ భవనం తదితర నిర్మాణాలు చేపట్టారు.

పద్మనగర్, కిసా న్ నగర్ సమీకృత మార్కెట్ల పనులు కొనసాగుతున్నాయి. కాశ్మీర్ గడ్డ మార్కెట్ పనులు వారం క్రితం ప్రారంభ మయ్యాయి. కమాండ్ కంట్రోల్ భవన పనులు కొనసాగు తున్నాయి. హౌసింగ్ బోర్డు కాలనీలోనూ డ్రైనేజీల కనెక్టి విటీ, టైల్స్, స్మార్ట్ స్ట్రీట్ లైట్ల విద్యుత్ కనెక్షన్, హెచ్.ఆర్ జంక్షన్ తదితర పనులు పూర్తి చేయాల్సి ఉంది.నిధులు సకాలంలో విడుదల కాకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం వాటా ను జమచేయక పోవడం, అక్రమాలు చోటుచేసుకోవ డంపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అధికార విపక్షాల మధ్య విమర్శలతో వందశాతం పనులు పూర్తికాలేకపోయాయి. ముందుగా నిర్ణయించిన ప్రకారం జూన్ 30తో స్మార్ట్ సిటీ పనులు వంద శాతం పూర్తి చేయాల్సి ఉంది. కరోనాతో రెండేళ్ల పాటు పనులు వేగంగా చేయలేక పోయిన కారణంగా గడువు పొడిగించాలంటూ పలువురు కోరుతూ వచ్చారు. గతంలో కరీంనగర్ ఎంపీగా ఉన్న ప్రస్తుతం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మరో తొమ్మిది నెలలు గడువు పెంచడంతో, నగరంలో స్మార్ట్ సిటీ పనులు వందశాతం పూర్తయ్యే అవకాశం లభించింది. కేంద్రం నిర్ణయంతో కరీంనగర్, వరంగల్ నగరాలు పూర్తిస్థాయి లో అభివృద్ధి అయ్యే అవకాశాలు ఉన్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ నిధులను విడుదలకు తాను మూడుసార్లు లేఖ రాశానని గుర్తుచేశారు. గత పాలకులు కమీషన్లకు కక్కుర్తితోనే స్మార్ట్ సిటీ పనుల్లో జాప్యం జరిగిందని ఆరోపించారు. స్మార్ట్ సిటీ నిధుల అవకతవకలు, కమీషన్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన గడువుతో అన్ని రకాల సదుపాయలు సమకూరుతాయని నగర మేయర్ వై సునీల్ తెలిపారు. మిగిలిన పనులు పూర్తి చేసి, నగరాన్ని సుందరవనంగా అభివృద్ధి లో అగ్రగామిగా నిలుపుతామన్నారు.

# మొక్కల లెక్కల్లో గోల్ మాల్



(మొదటి పేజీ తరువాయి)

సిద్ధం చేస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన హరిత హారం పథకంపై నూతన కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. కార్యక్రమంలో నాటిన మొక్కలు, చేసిన ఖర్చు, నిధుల దుర్వినియోగం తదితర అంశాలపై సమగ్ర సమాచారం తెలుసుకునేం దుకు కమిటీ వేయాలని భావిస్తోంది. అంతకు ముందే గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన నేతల గ్రామాలు, ప్రాతినిథ్యం వహించిన నియోజకవర్గాల్లో పథకం అమలు తీరుపై అధ్యయనం చేయాలని సర్కార్ నిర్ణయిం చినట్లు తెలుస్తోంది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు వంటి కీలక నేతల నియోజకవర్గాలు, వాటి పరిధిలోని గ్రామాలలో నర్సరీలు నెలకొల్పేందుకు చేసిన ఖర్చు, నాటిన మొక్కలు, ప్రస్తుత పరిస్థితిపై వాస్తవాలు తేల్చాలని ఆదే శించారు. ఆయా పంచాయతీల పరిధిలో నాటిన మొక్కలెన్ని, ప్రస్తుతం ఉన్నవి ఎన్ని అనేది తెలియాలని అన్నట్లు సమాచారం. ఈ విషయంలో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలని తన కార్యదర్శిని ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి హరిత హారం పథకం విషయంలో కమిటీ వేసేందుకు నిర్ణయం తీసుకోలేదని, ప్రాథమికంగా కొన్ని గ్రామాల్లో అధ్యయనం చేసి, అందులో తేలిన అంశాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితిపై కమిటీ వేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల సమాచారం.

# కమంలో ఇమడలేకపోతున్నారా..?

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీగా గెలిచారు. అయితే ఆయన కేంద్ర మంత్రి పదవిని ఆశించారు. కానీ మోదీ సర్కార్ లో మాత్రం ఆయన ఆశించింది జరగలేదు. కేంద్ర మంత్రివర్గంలోకి కిషన్ రెడ్డిని, బండి సంజయ్ ను మోదీ తీసుకున్నారు. కె.లక్ష్మణ్ లాంటి సీనియర్ నేతలున్నప్పటికీ వాళ్లిద్దరూ రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారని భావించి మోదీ వాళ్లిద్దరికే కేబినెట్ లో చోటు కల్పించారు. ఇప్పుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని ఈటల రాజేందర్ ఆశిస్తున్నట్లు కనపడుతుంది. మంత్రి పదవి దక్కక పోయినా కేంద్రంలో అధికారంలోకి మళ్లీ రావడంతో రాష్ట్ర అధ్యక్ష పదవిని చేపట్టాలని ఆయన ఉవ్విళ్లూరుతున్నారు. అయితే బీజేపీ అధ్యక్ష పదవి కోసం అనేక పేర్లు వినిపిస్తున్నాయి. డీకే ఆరుణ, ధర్మపురి అరవింద్ వంటి పేర్లు కూడా వినిపిస్తుండటంతో ఈటల కొంత అసహనంగా ఫీలవుతున్నారని ఆయన మాటలను బట్టి వ్యక్తమవుతుంది. మీడియా మిత్రులు అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ బీజేపీ అధ్యక్షుడిగా ఏ ఫైటర్ కావాలి.. స్ట్రీట్ ఫైటరా.. రియల్ ఫైటరా.. అంటూ ప్రశ్నించారు. ఐదుగురు ముఖ్యమంత్రులతో తాను కొట్లాడానంటూ తనకు తానే గొప్పలు చెప్పుకునే ప్రయత్నం చేశారు. సందర్భం వచ్చినప్పుడు కుంభస్థలాన్ని కొట్టే దమ్మున్నోడు కావాలని.. గల్లీ ల్లో కొట్లాడేవాళ్లు కాదని అంటూ మిగిలిన నేతలను కించపర్చే విధంగా మాట్లాడటంపై కొందరు నేతలు హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. మొత్తం మీద ఈటల రాజేందర్ ఇక్కడ కూడా ఇమడలేకపోతున్నట్లే కనిపిస్తుంది.

# మోదీ వర్సెస్ ఆర్ఎస్ఎస్

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గం ఏర్పాటులో కూడా ఆర్ఎస్ఎస్ దే పైచేయి కనిపిస్తోంది. నిజానికి తెలంగాణ నుంచి ఈటల రాజేంద ర్ ను కేంద్ర కేబినెట్ లో తీసుకుంటారని అంతా భావించారు. అలా అనుకోవడానికి కూడా కారణం లేకపోలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఈటల రాజేందర్ ఒత్తిడితో బండి సంజయ్ ను పార్టీ బాధ్యతల నుంచి తప్పించారు. కాబట్టి.. కేంద్ర పెద్దల దగ్గర ఈటలకు పలుకుబడి ఉందని.. అందుకే ఆయన్ని కేంద్ర కేబినెట్ లోకి తీసుకుంటారని చాలా మంది అనుకున్నారు. కానీ, ఎన్నికల ఫలితాలు అంచనాలను అందుకోలేకపోవడంతో.. ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ ను బండి సంజయ్ కు మంత్రి పదవి వరించింది. ఇక.. ఈటల రాజేందర్ కు పార్టీ పగ్గాలు అప్పగిస్తారని ప్రచారం జరిగినా.. ఆర్ఎస్ఎస్ మనసులో రామ్ చందర్ రావు, మనోహర్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. 10 రోజుల క్రితం కూడా ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షం అంటే శత్రువు కాదని.. వారికి మాట్లాడే అవకాశం ఇవ్వాలని అన్నారు. అంటే మోదీని ఉద్దేశించే ఈ కామెంట్స్ చేశారని క్లియర్ గా అర్థం అవుతోంది. దీంతో.. ప్రధాని మోదీకి ఆర్ఎస్ఎస్ అడ్డుపుల్లలు వేస్తుందని స్పష్టం అవుతుంది.

# రైతు సంక్షేమమే లక్ష్యం

**చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ అలసకాని జనార్ధన్**

**ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం**

**సూర్యాపేట జిల్లా, జూన్ 7 :** రైతు సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం అని చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ అలసకాని జనార్ధన్ అన్నారు. శనివారం చిలుకూరు పీఏసీఎస్ లో 102 వ అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా సహకార బ్యాంకులో జెండా ఎగుర వేసి మాట్లాడారు.ప్రతి ఏడాది జూలై మొదటి శనివారం ఈ దినోత్సవం జరుపుకుంటామని దీనికి ముఖ్య ఉద్దేశం సహకార రంగం పట్ల అవగాహన పెంచడం అన్నారు. సహకార ఉద్యమం ద్వారా అంతర్జాతీయ సంఘీభావం, ఆర్థిక సామర్థ్యం , సమానత్వం ప్రపంచ శాంతి కొరకు ప్రోత్సహించే దిశలో ఆలోచించడం అన్నారు. సహకార సంఘాలు ఏర్పడ్డాకనే రైతుల జీవితాలలో మార్పులు వచ్చాయని అన్నారు. ఒకప్పటి కంటే ఇప్పుడు సహకార సంఘం బ్యాంకులు అన్ని సదుపాయాలు రైతులకు కలిగిస్తున్నాయని అన్నారు. రైతులకు, డైరెక్టర్ లకు సహకార దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి చిలువేరు లక్ష్మీనారాయణ, డైరెక్టర్స్ కొండా సోమయ్య, కస్తూరి సైదులు, కోడారు రాంబాబు, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

# మున్నూరు కాపులకు మంత్రి పదవులివ్వాలి

**హైదరాబాద్ జూలై 7 (ప్రజాస్వరం):** రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మున్నూరు కాపు సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 24 శాతానికి పైగా ఉన్న మున్నూరు కాపు సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత రాష్ట్ర జనాభాలో 24 శాతానికి పైగా ఉన్న మున్నూరు కాపు సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాబోవు మంత్రి వర్గ విస్తరణలో రెండు మంత్రి పదవులను తమ సామాజిక వర్గానికి కేటాయించాలని కోరారు. మున్నూరు కాపు కార్పొరేషన్కు 2000 కోట్లు కేటాయించాలని, కోకాపేట ఆత్మగౌరవ భవన నిర్మాణానికి 20 కోట్లు కేటాయించాలని, ప్రతి జిల్లా కేంద్రంలో బాల బాలికల హాస్టల్ నిర్మాణం కోసం రెండు ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు.

# 'సోషల్' ఫైట్

(మొదటి పేజీ తరువాయి)

పన్ను విధానం అమలు చేస్తోంది. కానీ, దీనిపై విపక్ష ఇండియా కూటమి ఇప్పుడు కేంద్రం భారీగా పన్నులు విధిస్తోందని ప్రచారం మొదలు పెట్టింది. గతంలో వేర్వేరు పన్నులు కట్టినా అవి మనకు తెలిసేవి కావు. కానీ బీజేపీ జీఎస్టీ విధానంతో పౌరులు ఎంత పన్ను చెల్లిస్తున్నార్న విషయం తెలిసేలా చేసింది. దీనినే ఇప్పుడు విపక్ష కూటమి తమకు అనుకూలంగా మార్చుకుంటోంది. కేంద్రం జీఎస్టీ రూపంలో భారీగా పన్నులు వసూలు చేస్తోందని ప్రచారం చేస్తున్నాయి. తద్వారా కేంద్రంపై విషం చిమ్మే ప్రయత్నం జరుగుతోంది.ఇక కేంద్రం వసూలు చేస్తున్న టోల్ ట్యాక్స్ పైనా విపక్షాలు ప్రచార జోరు పెంచాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే జూన్ 1 అర్ధరాత్రి నుంచి టోల్ చార్జీలు 5 శాతం పెరిగాయి. దీంతో ఇప్పుడు దీనిని కూడా విపక్ష కూటమి తనకు అనుకూలంగా, కేంద్రంపై వ్యతిరేకంగా ప్రచారం చేసుకుంటున్నాయి. అటల్ బిహారి వాజ్ పేయి అమలు చేసిన స్వర్ణ చతుర్భుజి పథకంలో భాగంగా ప్రధాని మోదీ రోడ్ల విస్తరణకు అనేక చర్యలు చేపట్టారు. మోదీ ప్రధాని అయ్యాక వేల కిలోమీటర్ల రోడ్లు విస్తరణకు నోచుకున్నాయి. సౌకర్యాలు మెరుగుపర్చిన నేపథ్యంలో రహదారుల నిర్వహణకు అయ్యే చార్జీలను కూడా కేంద్రం వాహనదారుల నుంచే వసూలు చేస్తుంది. అందుకే రోడ్లు అందరికీ సౌకర్యంగా ఉంటున్నాయి. పెరుగుతున్న రేట్లకు అనుగుణంగా టోల్ చార్జీలను కూడా కేంద్రం సవరిస్తోంది. దీనిని కూడా విపక్షం తమకు అనుకూలంగా ప్రచారం చేసుకుంటోంది. ఇలా అనేక కార్యక్రమాలపై కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని విపక్ష పార్టీలు సోషల్ మీడియా వేదికగా మెల్లిగా జనంలోకి చొప్పిస్తున్నాయి. ఉన్నఫలంగా ప్రభుత్వానికి ఏమీ కాకపోయినా.. రాబోయే రోజుల్లో ఇవి బీజేపీకి నష్టం కలిగిస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# వీకెండ్ ఎమ్మెల్యేలు



- వారంలో ఒక్కరోజు కూడా కనిపించని ఎమ్మెల్యేలు
- చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిపై నియోకవర్గ ప్రజల అసహనం

**అదిలాబాద్, జూలై 7, (ప్రజాస్వరం):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో పది నియోజక వర్గాల్లో ప్రజలిచ్చిన తీర్పుతో నలుగురు బీజేపీ, నలుగురు కాంగ్రెస్, ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచారు. ఈ పది మందిలో సగానికి పైగా ఎమ్మెల్యేలు స్థానికులే అయినా ఆ ముగ్గురు మాత్రం పక్కా నాన్ లోకల్ అన్నట్టుగానే వ్యవహరిస్తున్నారట. ఎమ్మెల్యేలుగా గెలిచి ఏడు నెలలైనా స్థానికంగా అందుబాటులో ఉన్నది జస్ట్ పదంటే పది రోజులు కూడా లేరన్నదీ నియోజకవర్గ ప్రజల మాట. నియోజకవర్గ అభివృద్ధి కోసం కలుద్దాం అంటే స్థానికంగా అందుబాటులో ఉండటం లేదని, అత్యవసరం అయితే రాజధాని హైదరాబాద్కు పరుగులు తీయాల్సి వస్తుందని చెప్తున్నారు. తీరా అక్కడికి వెళ్లినా పని అవుతుందన్న నమ్మకం ఉండటం లేదని, అంతా పీఏల రాజ్యమే సాగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. ఈ లిస్ట్ లో ఉమ్మడి ఆదిలాబాద్ నుండి గెలిచిన చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు గడ్డం బ్రదర్స్ వినోద్, వివేక్ టాప్ ప్లేస్ లో ఉండగా, నిర్మల్ ఎమ్మెల్యే, బీజేపీఎల్పీ లీడర్ మహేశ్వర్ రెడ్డి వీకెండ్ ఎమ్మెల్యేలు అన్న ముద్ర వేసుకున్నారు. జనం. ప్రజలకు కాదు కదా కనీసం పార్టీ క్యాడర్ కు కూడా అందుబాటులో ఉండటం లేదని ఆయా నేతల పార్టీ కార్యకర్తల మాట. ఎమ్మెల్యేలు గడ్డం వినోద్ , వివేక్ లు అయితే స్థానికంగా ఉంటాం. ఇక్కడే ఇల్లు కట్టుకుంటాం అని ఎన్నికల సమయంలో బాండ్ పేపర్ రాసిచ్చి మరీ బాస చేసి, గెలిచిన వెంటనే ఒట్టు తీసి గట్టు మీద పెట్టారన్న ఆరోపణలు బలంగానే వినిపిస్తున్నాయట. మరో ఆరుగురు ఎమ్మెల్యేల్లో.. ఆదిలాబాద్, ముథోల్, బోథ్, ఖానాపూర్, సిర్పూర్, ఆసిపాబాద్ ఎమ్మెల్యేలు పక్కా లోకల్ అంటూ అభివృద్ధి కార్యక్రమాల్లో దూసుకుపోతుండంతో, కనీసం వారిని చూసైనా మా ఎమ్మెల్యేలు మారితే అదే పది వేలు అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారట ఆ మూడు నియోజక వర్గాల జనం.

నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి బీజేపీఎల్పీ బాధ్యతలు చేపట్టాక బిజీబి జీగా మారారని, అయితే గడ్డం వివేక్ వెంకటస్వామి, వినోద్ లు మాత్రం పదవుల కోసం ఢిల్లీలో చక్కర్లు కొడుతున్నారని ఆరోపిస్తున్నారు. నిన్నటి వరకు కొడుకు ఎంపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేసిన గడ్డం బ్రదర్స్.. తీరా ఎంపీ ఎన్నికలు ముగియడంతో మంత్రి పదవి సాధించుకునేందుకు బిజీ అయ్యారని, ఇంకా నియోజకవర్గాన్ని ఎప్పుడు పట్టించుకుంటారని ప్రశ్నిస్తున్నారట. ఒకవేళ మంత్రి పదవి దక్కితే ఈ వీకెండ్ పాలన కూడా హైదరాబాద్ నుండే సాగుతుందేమనన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారట చెన్నూర్, బెల్లంపల్లి నియోజక వర్గ జనం. ఇప్పటికే మా నేతలను కలవాలంటే అయితే హైదరాబాద్ లేదంటే, ఢిల్లీ బాట పట్టాల్సి వస్తుందని, అక్కడైనా కలుస్తారని ఆశపడితే పొరపాటేనని చెప్పుకుంటున్నారంట గడ్డం బ్రదర్స్ నియోజక వర్గ జనం. చెన్నూర్ నియోజక వర్గ జనం అయితే గతంలో నాన్ లోకల్ లీడర్ ను గెలిపించుకుని ముప్పు తిప్పలు పడ్డామని, ఇప్పుడు అదే సీన్ రిపీట్ అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. ఇక మా నియోజకవర్గ ఎమ్మెల్యే మంత్రులైతే కనీసం కంటికి అయినా కనిపిస్తారో లేదో అని చెవులుకొరుక్కుంటున్నారంట గడ్డం బ్రదర్స్ అభిమాన ఘనం. చూడాలి మరీ పదవుల పందెరంలో బిజీ అయినా ఆ ముగ్గురు వీకెండ్ ఎమ్మెల్యేలు ఇకనైనా నియోజక వర్గం పై ఫోకస్ పెడ్తారో లేక మేము పక్కా గెస్ట్ ఎమ్మెల్యేలమే అని ముద్ర కంటిన్యూ చేసుకుంటారో చూడాలి..!

# ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

- నిర్వహణలోపాల కారణంగానే రైలు ప్రమదాలు
- ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ నిబంధనలను సమీక్షించాలి
- రైల్వే శాఖలో 3.11 లక్షల పోస్టులను భర్తీ చేయాలి
- ఉద్యోగుల, ఆఫీసర్ల, పెన్షనర్ల జాతీయ నేత కృష్ణ మోహన్

**హైదరాబాద్, జూలై 7 (ప్రజాస్వరం) :** నిర్వహణాలోపాల కారణంగా రైలుప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాక్ లపై ఒత్తిడి పెరుగుతుందని, భద్రతా చర్యలు చేపట్టడం లేదని, ఒడిషా రైలు ప్రమాదం నుండి తేరుకోకముందే 40 ప్రమాదాలు జరిగాయని ఉద్యోగుల, ఆఫీసర్ల, పెన్షనర్ల జాతీయ నేత వి. కృష్ణ మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న పలు రైల్వే ప్రమాదాలపై ప్రధాన మంత్రికి ఆయన లేఖ రాశారు. ఈ సందర్భంగా భద్రతా లోపాలను ఎత్తి చూపారు. జూన్ 17 న 11 మంది మృతికి దారితీసిన కాంచన్ జంగ ప్రమాదానికి కూడా ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ పని చేయకపోవడం, పరస్పర విరుద్ధమైన నిబంధనల మూలంగా నెలకొన్న గందరగోళం, కవచ్ రక్షణ వ్యవస్థ లేకపోవడమే ప్రధాన కారణాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్స్ కాన్ఫెడరేషన్ (సీసీజీజీఓఓ), దాని అనుబంధ గుర్తింపు పొందిన ఇండియన్ రైల్వే ప్రమోటీ ఆఫీసర్స్ ఫెడరేషన్ (ఐఆర్పీఓఎఫ్) తదితరులు పలుమార్లు వివిధ అంశాలపై సమర్పించిన వినతి పత్రాలను, కాగ్ తదితర నివేదికలను జత చేశారు. రైల్వే భద్రతకు సంబంధించిన అన్ని అంశాలను పరిష్కరించాలని, వ్యవస్థాగత లోపాలను సరిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. ఇండియన్ రైల్వే మేనేజ్ మెంట్ సర్వీస్ (ఐఆర్ఎమ్ఎస్) పేరిట ప్రవేశపెట్టిన స్కీం పట్ల పునరాలోచన చేయాలని కోరారు.

ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థలో సిగ్నల్ విఫలమైన సమయాల్లో రైళ్ల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు గందరగోళంగా ఉన్నాయని, ఆటోమేటిక్ బ్లాక్ సిస్టమ్స్ ఇన్ జనరల్ అండ్ సబ్సిడరీ రూల్స్ 9వ అధ్యాయంలో పేర్కొన్న నిబంధనలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని, వాటిని నిశితంగా సమీక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సిగ్నల్ విఫలమైనపుడు స్టేషన్ మాస్టర్లు జారీ చేసే ట్రావెల్ అథారిటీ టిఎ-912 రెడ్ సిగ్నల్ పడినా దాటేందుకు లోకో పైలెట్లకు అనుమతినిస్తుందని, దాన్ని నిషేధిస్తున్నట్లు తూర్పు రైల్వే ఆదేశాలు జారీ చేసి ఆ మరుసటి రోజే పొరపాటున జారీ చేసామని ఆ ఆదేశాలను ఉపసంహరించుకున్నారని తెలిపారు. స్టాండర్ట్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ ఓపి)పై జోనల్ రైల్వేస్ లో అయోమయం, గందరగోళం వుంటొందని, సిగ్నల్ వైఫల్యం తదితర పరిస్థితుల్లో అమలు చేయాల్సిన రైళ్ళ నిర్వహణా ప్రొటోకాల్స్ లో గందరగోళానికి కారణమవుతోందని వాపోయారు.2011-12 లో అభివృద్ధి చేసిన ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ 'కవచ్' నెలకొల్పక పోవడం, సిగ్నలింగ్ టెలీ కమ్యూనికేషన్ కింద కేటాయించిన బడ్జెట్లో అత్యధికంగా ట్రాఫిక్ ఉన్న రైల్వే మార్గంలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్, సెంట్రలైజ్డ్ ట్రాఫిక్ కంట్రోల్ తదితరములకు ఒక్క పైసా కూడా ఖర్చు చేయక పోవడం, రైల్వే లైన్లు, సిగ్నల్ వ్యవస్థ, ట్రాకుల ఆధునీకరణ చేపట్టకపోవడం శోచనీయమన్నారు.భద్రతా చర్యల బలోపేతంలో తాత్సారం తగదని, కృత్రిమ మేధస్సు (ఏఐ) ను సిబ్బంది తొలగింపుకు, పోస్టుల రద్దుకు వినియోగించే బదులు విస్తృతంగా స్టేషన్ డేటా లాగర్ల, లోకోమోటివ్ లలోని మైక్రో ప్రాసెసర్ల డిజిటల్ డేటాను తక్షణమే విశ్లేషించి ప్రమాదాలను నివారించాలని, నిధుల కేటాయింపును పెంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రమాద రహిత భద్రమైన రైల్వే వ్యవస్థ కోసం వినియోగించాలని కోరారు. ఒకవేళ దేశవ్యాప్తంగా కవచ్ ను వెంటనే ఏర్పాటు చేయలేనట్లైతే కనీసం ఈటీసీఎస్ లెవెల్ 2 ను వినియోగించాలని విన్నవించారు. కనీస అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, సాధారణ ప్రయాణికుడిని విస్మరిస్తూ ఆదాయాన్ని గడిస్తున్న రైల్వే శాఖలో 3.11 లక్షల గ్రూప్ సీ పోస్టులు, 3,018 గెజిటెడ్ క్యాడర్ మంజూరు అయిన పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీకి నోచుకోకపోవడంతో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో మిగిలిన ఉద్యోగులపై తీవ్రమైన పనిభారం పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేసారు. దీంతో చాలా మంది మహిళా లోకో పైలట్లు, ఇతర సిబ్బంది రోజుకు 12 గంటలకు మించి సెలవు, విశ్రాంతి లేకుండా నిద్రలేమితో పని చేస్తున్నారని తెలిపారు. రైల్వేలో పని చేస్తున్న సుమారు 8 లక్షల మంది కాంట్రాక్ట్ కార్మికులు కనీస వేతనాలు, సురక్షిత పని పరిస్థితులు, చట్టబద్ధ హక్కులు కోల్పోయారని, ప్రశ్నిస్తే తొలిగింపులు, సస్పెన్షన్లు, బదిలీలు, శిక్షలు వంటి సమస్యల మధ్య రైల్వే సిబ్బంది పని చేస్తున్నారని పేర్కొన్నారు. తమ విజ్ఞప్తిని మన్నించి ఆర్ఆర్ బీ దేశవ్యాప్తంగా అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టుల సంఖ్యను 5,696 నుండి 18,799 కు పెంచి భర్తీ చేయాలని జూన్ 19న నిర్ణయించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ వాదనలు దాని సొంత ఆడిటర్ అయిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలో చెప్పిన దానికి విరుద్ధంగా ఉన్నాయి. రైలు భద్రతపై కాగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 2017-2021 మధ్య జరిగిన రైల్వే ప్రమాదాలపై కాగ్ విశ్లేషణ ప్రకారం.. ఈ కాలంలో మొత్తం 2017 ప్రమాదాలు జరిగాయి. అందులో పట్టాలు తప్పినవి 1392 ప్రమాదాలు (69 శాతం). అంటే పట్టాలు తప్పి ఢీ కొనటం వంటి రైల్వే ప్రమాదాలే అధికంగా ఉండటం గమనార్హమన్నారు.

2017-18లో ప్రవేశపెట్టిన రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్ (ఆర్ ఆర్ఎస్ కే) రైల్వే భద్రతా నిధి గురించి కాగ్ ఉటంకించింది. 1127 పట్టాలు తప్పగా 289 (26 శాతం) మాత్రమే పునరుద్ధరణ పనులకు నోచుకున్నాయని వివరించింది. ఆర్ఆర్ఎస్ కే నుంచి ప్రాధాన్యత-1 పనులపై మొత్తం వ్యయం 2017-18లో 81.55 శాతం నుంచి 2019-20లో 73.76 శాతానికి తగ్గుదల ధోరణిని చూపించిందని పేర్కొన్నది. ట్రాక్ పునరుద్ధరణ పనులకు 2018-19లో నిధుల కేటాయింపు రూ.9607.65 కోట్ల నుంచి 2019-20లో రూ.7417 కోట్లకు తగ్గిందని కాగ్ వివరించింది. అత్యంత రద్దీగా ఉండే పశ్చిమ రైల్వే కోసం 2019-20లో మొత్తం వ్యయంలో ట్రాక్ పునరుద్ధరణ కోసం ఖర్చు చేసినది 3.01 శాతమే కావటం గమనార్హం. 2017 లో సమర్పించిన భద్రతపై టాస్క్ ఫోర్స్ సిఫార్సులను, 2015 లో రైల్వే మంత్రిత్వ శాఖ 'శ్వేతపత్రం'ను అమలు చేయలేదు. పాత ట్రాక్ ను యుద్ధ ప్రాతిపదికన మార్చాల్సి ఉంటుందని, కానీ ఆర్థిక వనరులు లేమి సాకుతో చేయకపోవడంతో బ్యాక్ లాగ్ పెరుగుతూనే ఉన్నదని, అదే సాకుతో పాతబడి పోయిన సిగ్నల్ గేర్ ను కూడా మార్చటం లేదని అన్నారు.రైల్వేలు ప్రజల ఆస్తియని,మన ప్రజల సొమ్ముతో భారత కార్మికుల కష్టాలతో భారతీయ రైల్వేలు నిర్మించబడ్డాయని పేర్కొన్నారు.

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా సుదర్శన్ రెడ్డి



**హైదరాబాద్ జూలై 7 :** రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో)గా సి.సుదర్శన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు వెలువరించింది. సుదర్శన్ రెడ్డి ప్రస్తుతం సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శిగా ఉన్నారు. సీఈవో పోస్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురి పేర్లను పంపించగా, 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సుదర్శన్ రెడ్డిని సిఇసి ఎంపిక చేసింది.ప్రస్తుత సీఈవో వికాస్ రాజ్ కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి రిలీవ్ చేసింది. వికాస్ రాజ్ కు ఒకటి రెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం పో స్టింగ్ ఇవ్వనుంది.

# ఏలూరులో ట్రాఫిక్ సమస్య

**ఏలూరు, జూలై 7 (ప్రజాస్వరం):** ఏలూరు నగరాన్ని పట్టిపీడిస్తున్న అతి ముఖ్యమైన సమస్యల్లో ప్రధాన సమస్య ట్రాఫిక్.. ఏలూరు నగరం భౌగోళికంగా రోజురోజుకు జనాభివృద్ధి చెందుతూ విస్తరిస్తూ ఉండటం, అందుకు అనుగుణంగా ఇక్కడ ఉన్నటువంటి సమస్యల మీద అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు తక్షణమే మేలుకొనకపోతే చాలా సమస్యలు ఉత్పన్నం అవుతాయి. అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వ్యాపార సముదాయాలు ఉన్న ప్రదేశాలలో రోడ్డుకి ఇరువైపులా ద్విచక్ర వాహనాలు మరియు కార్లు పార్కింగ్ చేయడం వల్ల ఆ రహదారి వెంబడి ప్రయాణించే వాహనదారులకు చాలా ఇబ్బందికర పరిస్తితులు ఎదురవుతున్నాయి. ఇదే విషయాన్ని సదరు పోలీస్ శాఖ వారికి ఎన్నిసార్లు నివేదించిన చర్యలు తీసుకోవడంలో ప్రజా ప్రతినిధులు సరైన చర్యలు తీసుకోకుండా తూతూ మంత్రంగా ఆదేశాలు జారీ చేయడం వల్ల నగర ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతుంది. ఏలూరు పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. వ్యాపార సముదాయాలు ఉన్నప్పుడు తప్పనిసరిగా పార్కింగ్ వ్యవస్థను ఏర్పరచుకోవడం ఆ యజమానులదే బాధ్యత. ఈ చిన్న విషయాన్ని ప్రజా ప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా హాస్పిటల్స్, కాలేజెస్ ఉన్నటు వంటి రోడ్లలో పరిస్థితి మరీ దారుణంగా తయారయింది. వాహనదారుల తో ట్రాఫిక్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించించడం, అని నిత్యం ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరగటం నిత్యకృతంయిపోయింది. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి ఈ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపిస్తారని నగర వాసులు కోరుతున్నారు.



# కోట్ల రూపాయల ఆశ చూపినా పార్టీ మారలేదు

- చదువుకుంటున్న రోజుల్లో నక్సలైట్ అవుతానని అనుకోలేదు
- రాజకీయంగా ఎదుర్కోలేకే వ్యక్తి గతంగా టార్గెట్ చేస్తున్నారు
- అందుకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నోటీసులు పంపించా
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

**హనుమకొండ:** కోట్ల రూపాయలు ఇస్తామంటూ ఆఫర్ ఇచ్చినా తాను కాంగ్రెస్‌ను వీడలేదని మంత్రి సీతక్క అన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన "రణ ధీర సీతక్కష పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. సీతక్క జీవిత నేపథ్యంతో అస్నాల శ్రీనివాస్ పుస్తకాన్ని రచించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క తన జీవిత విశేషాలను తలచుకుని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.." నేను చదువుకుంటున్న రోజుల్లో నక్సలైట్ అవుతానని అనుకోలేదు. విప్లవ ఉద్యమం నుంచి ఇవాళ ప్రజాసేవలో ఉన్నాను. పేదలను అసహ్యించుకునే వాళ్లు రాజకీయాల్లో ఎక్కువగా ఉన్నారు. పేదరిక నిర్మూలన జరిగితేనే నా లక్ష్యం నెరవేరినట్లు. తెలంగాణ ప్రజల పోరాట ఫలితంగానే రాష్ట్రం ఏర్పడింది. రాజకీయ నేతలు తప్పులు చేస్తే మేధావివర్గం తట్టి చెప్పడానికి ముందుకు రావాలి. రాజకీయంగా నన్ను ఎదుర్కొనే సత్తాలేక వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారు. నన్ను దెబ్బకొట్టాలని పదేపదే దుష్ప్రచారాలు చేస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నోటీసులు పంపించా. రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటి నుంచి గోండులకు అవకాశం రాలేదు, ఎవ్వరూ మంత్రి కాలేదు. నాకు ఆ పదవి వస్తే బీఆర్ఎస్ వాళ్లు ఓర్వటం లేదు. నా ఉద్యమ జీవితాన్ని కూడా కించపరిచే విధంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. కోట్ల రూపాయలు ఇస్తామంటూ ఆఫర్ ఇచ్చినా నేను కాంగ్రెస్‌ను వీడలేదు" అని చెప్పారు.





## మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

**వికారాబాద్, జూలై 7 (ప్రజాస్వరం) :** ప్రధాని మోడీ పిలుపు మేరకు గండీడ్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలసి మొక్కలు నాటారు. అలాగే ప్రతి కార్యకర్త కూడా మొక్కలు నాటాలని ఈ సందర్భంగా పరిగి నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జి మారుతి కిరణ్ బూనేటి చెప్పారు. అనంతరం జక్ల పల్లి, కప్లపూర్ గ్రామంలో కార్యకర్తలతో సమావేశం అయ్యారు. కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎవరు అధైర్య పడొద్దు అన్నారు. ప్రతి గ్రామంలో కార్యకర్తలు స్థానిక సంస్థ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు ప్రభు నాయక్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, మోహన్ గౌడ్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు నర్సయ్య, బుచ్చి రెడ్డి, బోయిని కృష్ణ, శక్తీ కేంద్రం ఇంచార్జి రఘు, కేశవులు, పాండు, బాలయ్య,శేఖర్, గాజుల చెనయ్య, వెన్నచేడ్ శక్తీ కేంద్రం ఇంచార్జి గొడుగు రాములు, హరీష్ గౌడ్, జక్లపల్లి బూత్ అధ్యక్షుడు తిరుపతి, కాప్లపూర్ బూత్ అధ్యక్షుడు కృష్ణయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పరీక్షలు

**తాండూరు, జూలై 7 (ప్రజాస్వరం) :** తాండూరు పట్టణం శివాజీ చౌక్ ప్రాంతంలోని ఈశ ఆసుపత్రిలో ఆదివారం కీళ్లు – ఎముకల సమస్యల సంబంధించి డాక్టర్ కే కార్తీక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించినట్లు హాస్పిటల్ డైరెక్టర్ ప్రహ్లాద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన సుమారు 200 మంది పైచిలుకు బాధితులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్న బాధితులకు అవసరమయ్యే ఆపరేషన్లకు సైతం ప్రత్యేక రాయతీలతో ఎల్లప్పుడు తోడ్పాటు అందిస్తామని అన్నారు.




# సింగరేణిని బొందపెట్టేందుకే కుట్ర



- అందుకే కిషన్‌రెడ్డికి బొగ్గు మంత్రిత్వశాఖ
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**పెద్దపల్లి:** వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న సింగరేణిని బొంద పెట్టేందుకు కిషన్‌రెడ్డికి బొగ్గు మంత్రిత్వశాఖ పదవిని ప్రధాని మోదీ ఇచ్చారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. పెద్దపల్లిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకున్నారని తెలిపారు. స్వయంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వేలం కార్యక్రమంలో పాల్గొనబోతున్నారన్నారు. సింగరేణి విద్యుత్ సంస్థలు నష్టాల్లో ఉన్నాయని నమ్మించేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు విఫల ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. తెలంగాణ కొంగుబంగారం సింగరేణి సంస్థ అని, అది కేవలం ఒక కంపెనీ కాదని తెలంగాణ ఆర్థిక సామాజిక జీవనాడి అన్నారు. దక్షిణ భారతానికే వెలుగురేఖ అన్నారు. తెలంగాణ ప్రాంతంలో ఆరుజిల్లాల్లో విస్తరించి ఉన్న సంస్థ సింగరేణి అన్నారు. లక్షలాది మంది గ్రామీణ నిరుపేదలకు జీవితాన్ని ఇచ్చిన సంస్థ అన్నారు. అనేక పరిశ్రమలకు ఈ రాష్ట్రాభివృద్ధికి తోడ్పడ్డ సంస్థ సింగరేణి అన్నారు. 133 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ సంస్థలో లక్షలాది మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రముఖంగా నిలిచిన సంస్థ సింగరేణి అన్నారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో నిర్వహిస్తూ ఒకనాడు తీవ్రమైన నష్టాల్లో ఉన్నటువంటి కార్మికులు, యాజమాన్యం సమష్టి కృషితో అనేక సంవత్సరాలుగా లాభాలను ఆర్జించిన సంస్థ సింగరేణి అన్నారు. గత సంవత్సరంలో కూడా 32శాతం లాభాల వాటాను శ్రామికులకు అందించిన సంస్థ సింగరేణి అని స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థ అయినప్పటికీ సింగరేణి సంస్థ లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ కూడా ప్రైవేటుపరం చేయాల్సి దుర్మార్గమైన ఆలోచన కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. ఇది తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి గొడ్డలిపెట్టు లాంటిదన్నారు. ఎప్పుడైనా నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం, వేలం వేయడం చేస్తామన్నారు.

**తెలంగాణ ప్రయోజనాలను కాపాడిన నేత కేసీఆర్**

ఇక్కడ లాభాల్లో ఉన్న సింగరేణి సంస్థలను ప్రైవేటు పరం చేయడం దారుణమన్నారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో ఉన్న బొగ్గు గనులను ఆయా ప్రభుత్వాల విన్నపం మేరకు ఆ రాష్ట్రాలకే వదిలి వేయడం జరుగుతుందని.. ఒడిశా, తమిళనాడు గుజరాత్, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల్లో లాభాల బాటలో నడుస్తున్న సింగరేణి కూడా రాష్ట్ర ప్రయోజనాల కోసమే వదిలివేయాలన్నారు. గతంలో నుంచి కోరడం జరుగుతుందని.. తొమ్మిది సంవత్సరాల కాలంలో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్ని ఒత్తిళ్లు వచ్చిన ఏ ఒక్క బొగ్గు గనిని కూడా ప్రైవేట్ పరం కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడిన నాయకుడు కేసీఆర్ అన్నారు. మెడపై కత్తిపెట్టినా వేలం జరగకుండా అడ్డుకున్నదని.. సింగరేణి బలపడితే కార్మికులు బలపడతారన్నారు. సింగరేణి బలపడితే రాష్ట్రం బలపడుతుందన్నారు. అయినప్పటికీ మన ప్రధాని నరేంద్ర మోదీ నిన్నగాక మొన్న బాధ్యతలు తీసుకున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.



# భారతీయ సంస్కృతి గొప్పది

- భగవద్గీత దేశానికే గర్వకారణం
- గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

మేడ్చల్, జూలై 7 (ప్రజా స్వరం) : భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు గొప్పవని ప్రపంచ దేశాలు సైతం గౌరవిస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ తెలిపారు. మేడ్చల్ పట్టణం కిష్టాపూర్ రోడ్డులోని ఓం శివసాయి ఫంక్షన్ హాల్లో ఇస్కాన్ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ రాధాకృష్ణన్ హాజరయ్యారు. జగన్నాధున్ని దర్శనం చేసుకున్నారు. అనంతరం రాధాకృష్ణన్ మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని దేశాలు భారతీయ సంస్కృతిని ఆచరిస్తున్నాయని, భగవద్గీత 89 భాషల్లో అనువదింపబడిందని అన్నారు. ఇది మన దేశానికే గర్వకారణం అన్నారు. భారతదేశ సంస్కృతి గురించి పిల్లలకు చిన్నప్పటి నుంచే తెలియజేయాలని ప్రజలకు సూచించారు. మేడ్చల్ పట్టణంలో ఇస్కాన్ సంస్థ చేస్తున్న సేవలు అమోఘమని, జగన్నాథ రథయాత్రకు ఇస్కాన్ సంస్థ తన వంతు కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ భారతదేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రజల్లో మానవ సంబంధాలు రోజు రోజుకి దిగజారుతున్నాయని, పాశ్చాత్య పోకడలకు బానిసలుగా మారడమే ఇందుకు కారణమన్నారు.



బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్ రావు, విక్రంరెడ్డి, ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక







# గోల్కొండ బోనాలు షురూ..

- జగదాంబిక అమ్మవారికి తొలి బోనం
- రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు ..
- పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై నిషేధం
- నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు..



**రంగారెడ్డి, జూలై 7 (ప్రజాస్వరం):** తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు అద్దంపట్టే ఆషాఢ మాస బోనాలు ఘనంగా మొదలయ్యాయి. హైదరాబాద్ మహా నగరంలో వైభవంగా జరిగే బోనాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆషాడ మాసంలో జరిగే ఈ బోనాల పండుగను చూడటానికి రాష్ట్రం నలుమూలల నుంచి వస్తారు. ఇందులో భాగంగా ఆదివారం ఆషాడ మాసం తొలి బోనం గోల్కొండలోని జగదాంబికా మహంకాళి అమ్మవారికి భక్తులు సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ అర్చకులు తొలి బోనం సమర్పించారు. దీంతో గోల్కొండ పరిసర ప్రాంతాల్లో బోనాల సందడి మొదలైంది. డప్పు సప్పుడు, శివసత్తులు, పోతరాజులు విన్యాసాలతో పాతబస్తీ దద్దరిల్లిపోయింది. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. నేడు గోల్కొండ జగదాంబిక బోనాల ఉత్సవాలతో ఆషాడ బోనాలు ప్రారంభం కాగా.. ఈ నెల 21న లష్కర్ సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి బోనాలు జరగనున్నాయి. 28న పాతబస్తీలోని లాల్‌దర్వాజా బోనాలు జరగనున్నాయి. ప్రధాన ఆలయాలతోపాటు బస్తీల్లో అమ్మవారి బోనాల వేడుకలూ నిర్వహించనున్నారు. గోల్కొండ జగదాంబ ఆలయంలో నేడు ప్రారంభమైన ఉత్సవాలు నెల రోజులపాటు జరగనున్నాయి. ప్రతి ఆదివారం, గురువారం బోనాల ఉత్సవాలు జరుగుతాయి. మొదటి బోనం పూజ, చివరి బోనం పూజ గోల్కొండ జగదాంబ అమ్మవారి ఆలయంలోనే జరగటం విశేషం. సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి ఆలయంలో జరిగే బోనాలకు ఘనమైన చరిత్ర ఉంది. అక్కడ 1814 నుంచి బోనాల ఉత్సవాలు కొనసాగుతుండటం విశేషం. ఈనెల 21న బోనాల సమర్పణ, 22న భవిష్యవాణి (రంగం) కార్యక్రమం నిర్వహించనున్నారు. అ తర్వాత అంబారీపై అమ్మవారి ఊరేగింపు, పలహారం బండ్ల ఊరేగింపు జరుగుతాయని ఉజ్జయిని ఆలయ అర్చకులు తెలిపారు. ఇక పాతబస్తీలో 11 రోజులపాటు ఉత్సవాలు కన్నుల పండువగా జరగనున్నాయి. సింహవాహిని మహంకాళి ఆలయంతోపాటు ఉప్పుగూడ మహంకాళి ఆలయం, హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం తదితర ప్రధాన దేవాలయాల్లో బోనాల వేడుకలు జరుగుతాయి.

**ట్రాఫిక్ ఆంక్షలు**

గోల్కొండ బోనాల సందర్భంగా గోల్కొండకు వెళ్లే దారుల్లో వాహనాలను అనుమతించబోమని, భక్తులు కేటాయించిన ప్రదేశాల్లోనే పార్కింగ్ చేసుకోవాలని అడిషనల్ సీపీ పి.విశ్వ ప్రసాద్ తెలిపారు. బోనాలకు నగరంతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వచ్చే అవకాశమున్నందున వచ్చే రోడ్లలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు వాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుందన్నారు. గోల్కొండ కోటలో అమ్మవారికి ఈనెల 7న మొదటి పూజ, 11న రెండో పూజ, 14న మూడో పూజ, 18న నాలుగో పూజ, 21న ఐదో పూజ, 25న ఆరో పూజ, 28న ఏడో పూజ, ఆగస్టు 1న ఎనిమిదో పూజ, ఆగస్టు 4న తొమ్మిదో పూజ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా రామ్‌దేవ్‌గూడ నుంచి గోల్కొండకు వెళ్లే మక్కీదర్వాజ, లంగర్‌హౌజ్ నుంచి వెళ్లే ఫతేదర్వాజ, షేక్‌పేట నాలా నుంచి వెళ్లే బంజారాదర్వాజ వద్ద భారీగా భక్తులు వచ్చే అవకాశముండటంతో ఆయా ప్రాంతాల్లో వాహనాలను అనుమతించరు.

## ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**గోల్కొండ బోనాల కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బోనాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం కోసం 600 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామని, సీసీ కెమెరాల నిఘాలో బోనాలను పర్యవేక్షిస్తామని చెప్పారు. గోల్కొండ కోటకు వచ్చే వారికి మూడు ప్రాంతాల్లో పార్కింగ్ ఉంటుందని, సెవన్ టూంబ్స్ వద్ద ఓ పార్కింగ్, లంగర్‌హౌస్ హుడా పార్కు వద్ద పార్కింగ్, రాందేవ్‌గూడ దాటిన తర్వాత ఓ పార్కింగ్ ప్రదేశాన్ని కేటాయిస్తున్నామన్నారు. అంతేకాకుండా సెవన్ టూంబ్స్, రాందేవ్‌గూడల వైపు నుంచి వచ్చే వారికి పార్కింగ్ దగ్గర నుంచి కోట వరకు ఉచిత సెట్విన్ బస్సు, లంగర్‌హౌస్ హుడా పార్కు నుంచి వచ్చే వారి కోసం ఫ్రీ ఆటోలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నడుపుతున్నట్లు డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రజలందరూ పోలీసులకు సహాయ సహకారాలు అందించి ప్రశాంత వాతావరణంలో బోనాలను జరుపుకోవాలన్నారు.**



## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**మెదక్ సెషన్ జడ్జి లక్ష్మీ శారద**



**వెల్దుర్థి, జూలై 7 (ప్రజాస్వరం) :** పుట్టిన ప్రతి ఆడబిడ్డ పేరు మీద ఒక్క మొక్క నాటలని మెదక్ సెషన్స్ జడ్జ్ లక్ష్మి సుధ అన్నారు. మసాయి పెట్ మండల పరిధిలో నాడిమి తండాలోని దుర్గం తరుణ్ కృష్ణ నాయుడు వ్యవసాయపొలం వద్ద ఏర్పాటుచేసిన వన్ గర్ల్ వన్ ట్రీ గ్రీన్ నేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పుట్టిన ఆడ బిడ్డ పేరు మీదుగా మొక్కలు నాటడం అభినందనీయం అన్నారు. నాటిన మొక్కలు మహా వృక్షాలుగా పెంచి గిరిజనులు ఆదాయ వనరులుగా ఏర్పాటు చేసుకోవాలని వారికి సూచించారు. వాతావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి అవి పెరిగే వరకు బాగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ జడ్జి రీటాలాల్ చందు, దావత్ మహిపాల్, కేతావత్ ఘని, కళ్యాణ్, సురేష్, కిరణ్, కార్తీక్, కొండపోచయ్య పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**వికారాబాద్, జూలై 7 (ప్రజాస్వరం) : పరిగి నియోజకవర్గం కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ జన్మదిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు లాజర్ బొంపల్లి రమేష్ కుమార్, ఆనంద్, సుభాష్, వెంకటేష్ పాల్గొన్నారు.**

## బాల కార్మికులకు విముక్తి

- జిల్లా ఎస్పీ కే నారాయణరెడ్డి



**వికారాబాద్, జూలై 7 (ప్రజాస్వరం):** ఆపరేషన్ ముస్కాన్ ద్వారా జిల్లాలో 30 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. జూలై ఒకటవ తేదీ నుండి మొదలైన ఆపరేషన్ ముస్కాన్ -10 కార్యక్రమం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 30 మంది బాలకార్మికులను రెస్క్యూ చేశామని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ వివరాలు వెల్లడిస్తూ తప్పిపోయిన పిల్లలతో పాటుగా బాల కార్మికులుగా పనిచేస్తున్న చిన్నారులు, అక్రమ రవాణాకు గురవుతున్న చిన్నారులను గుర్తిం చి వారిని రక్షించి పునరావాసం కల్పించడమే ఆపరేషన్ ముస్కాన్-10 ముఖ్య లక్ష్యం అన్నారు. జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ జులై ఒకటవ తేదీ నుంచి 31 జులై వరకు కొనసాగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సబ్ డివిజన్ వారీగా లేబర్, ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్, స్వచ్ఛంద సంస్థలు, అలాగే పోలీస్ అధికారులతో కలపి 3 టీంలు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనబడితే 100 కి గానీ, పోలీస్ కంట్రోల్ రూమ్ 8712670056 నెంబర్ కు గాని సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు.

## రాష్ట్ర ప్రభుత్వం హామీలు అమలు చేయాలి



**మెదక్, జూలై 07 (ప్రజాస్వరం) :** ప్రభుత్వం హామీలు అమలు చేయాలని, జిల్లాలో 38 మత్స్య కార్మిక కుటుంబాల రెండు కోట్ల పెండింగ్ ప్రమాద బీమా డబ్బులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు దేవయ్య తెలిపారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో కేవలం కిషన్ భవనంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు పి దేవయ్య కే మల్లేశం మాట్లాడుతూ... ఆరు గ్యారెంటీల్లో భాగంగా పేదలకు పింఛన్లు ఇవ్వాలని, ఇండ్లు ఇళ్ల స్థలాలు, కౌలు రైతులకు 12000 వ్యవసాయ కూలీలకు 12000 రైతు భరోసా డబ్బులు వెంటనే చెల్లించాలని అన్నారు. జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం వలన 38 మత్స్య కార్మిక సంఘం సభ్యుల ప్రమాద బీమా డబ్బులు రెండు కోట్లు ఇస్తామని హామీ ఇచ్చిన మత్స్యశాఖ జిల్లా అధికారి వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. మత్స్య కార్మిక కుటుంబాల సభ్యులు అధికారులకు జిల్లా కలెక్టర్ కి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్య కార్మికులకు పెండింగ్లో ఉన్న ప్రమాద బీమా డబ్బులు రెండు కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, రామస్వామి, నరేందర్, నాగమణి, వెంకటి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి
- తాండూరు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం




**వికారాబాద్, జూలై 7(ప్రజాస్వరం) :** తాండూరు లయన్స్ క్లబ్ 50వ వార్షికోత్సవం, నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం పట్టణంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. అమెరికాలో చిన్న వ్యాపారవేత్తకు వచ్చిన ఆలోచన వల్ల ఏర్పడిన లయన్స్ క్లబ్ నేడు ప్రపంచవ్యాప్తంగా 200 పైగా దేశాల్లో సుమారు 13 లక్షల మంది సభ్యులతో విజయవంతంగా సేవలు అందిస్తోందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తాండూర్ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. డబ్బు సంపాదించడం అందరికీ వస్తుంది, కానీ సంపాందించిన దాంట్లో ప్రజా సేవకు ఖర్చు చేయడం కొందరికి మాత్రమే వస్తుందన్నారు. లైన్స్ క్లబ్ ద్వారా వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల వారు ప్రజలకు సేవ చేయడం అభినందనీయమన్నారు. క్లబ్ ద్వారా విద్య పరంగా కాకుండా ఇతర సేవలు అందించాలని సూచించారు. ఎమ్మెల్యేగా గెల్చిన తర్వాత ఎన్నికల కోడ్ వల్ల అభివృద్ధి పనులు జరగలేదని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నేరవేర్చడానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కొడంగల్ – తాండూర్ జంట నగరాలుగా అభివృద్ధి చెందబోతున్నట్లు పేర్కొన్నారు. రూ. 16 కోట్ల నిధులతో త్వరలో పూర్తి స్థాయిలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్, డాక్టర్ సంపత్ కుమార్, లయన్స్ క్లబ్ ఎన్నికల ఇంచార్జీ ఎన్ ఎన్ మూర్తితోపాటు లయన్స్ క్లబ్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

**ఎల్‌వోసీ అందజేత..**

అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తాండూరుకు చెందిన బసయ్యకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి రూ.2,50,000 (రెండు లక్షల యాభై వేలు) ఎల్‌ఓసీ మంజూరు చేయించి, ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు చెక్కును అందించారు. వైద్య పరంగా పేదలకు ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.



## ఈ భవనం ఒకప్పుడు బద్వేలు ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయం

### ఇప్పుడు పిచ్చి మొక్కల నడుమ భవనం

**బద్వేలు, జులై 7 (ప్రజాస్వరం) :**



పిచ్చి మొక్కలు మురికి కాలువల మధ్య ఉన్న ఈ భవనం ఒకప్పుడు బద్వేలు ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయం ఇది అక్షర సత్యం ఈ భవనంలోనే డిపో మేనేజర్ తోపాటు సిబ్బంది విధులు నిర్వహించేవారు ఆ తర్వాత డిపో గ్యారేజీ ఏర్పడడం బస్టాండ్ విస్తరించడం గ్యారేజీ ముందు భాగంలోనే రహదారి పక్కన పక్క భవనాలు ఏర్పడడంతో డిపో మేనేజర్ కార్యాలయం ఆ భవనాల్లోకి తరలిపోయింది ఇప్పటికి కూడా డిపో మేనేజర్ కార్యాలయం పక్కా భవనాల్లోనే కొనసాగుతుంది పక్కా భవనాల్లోకి డిపో మేనేజర్ కార్యాలయం తరలిపోయిన తర్వాత పాత భవనాన్ని అధికారులు మర్చిపోయారు పాత భవనాన్ని గతంలో ఒక ప్రవేట్ పాఠశాలకు అద్దెకిచ్చారు ఆ ప్రైవేట్ పాఠశాల కూడా ఒకటి రెండు సంవత్సరాలు మాత్రమే ఇక్కడ కొనసాగింది ప్రవేట్ పాఠశాల కాళీ చేసిన తర్వాత ఆ భవనం గురించి ఎవరు కూడా పట్టించుకోలేదు ఇప్పుడు కార్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలు దట్టంగా మొలిచాయి భవనం పక్కనే మురికి కాలువ ప్రవహిస్తుంది కార్యాలయం చుట్టుపక్కల నివాస గృహాలు ఉండడంతో మురికి కాలువల వల్ల నివాస గృహాల వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు ఈ విషయం గురించి సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన ఫలితం లేకుండా పోయింది వర్షాకాలంలో అయితే ఇక్కడ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది సంబంధిత అధికారులు ఈ భవనం విషయంలో స్పందించి చర్యలు తీసుకుంటే స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు అంతేకాక ఎంతోకాలంగా ఈ భవనం నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకుంటుంది మరి ఈ భవనం విషయం అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనేది వేచి చూడాలి.

## భారీగా పెరిగిన ఇంజనీరింగ్ సీట్లు

### ఆందోళనలో జేఎన్టీయూ

**హైదరాబాద్, జులై 7 (ప్రజాస్వరం) :**
తెలంగాణలో ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి కంప్యూటర్ సైన్స్, ఐటీ తదితర సీట్ల సంఖ్య భారీగా పెరగడంపై జేఎన్‌టీయూ హైదరాబాద్ ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో కోర్ ఇంజనీరింగ్ బ్రాంచీలను తగ్గిస్తూ.. సీఎస్ఈ, ఐటీ సంబంధిత విభాగాల్లో సీట్లను విపరీతంగా పెంచడం మంచిది కాదని తెలిపింది. ఇది భవిష్యత్తులో తీవ్ర విపరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించింది. ఈ మేరకు ఏఐసీటీఈకి జేఎన్‌టీయూహెచ్ లేఖ రాసింది. సీట్లు పెంచితే అధ్యాపకుల కొరత తలెత్తుతుందని లేఖలో పేర్కొంది. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం సూచన మేరకు జేఎన్‌టీయూ వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావు ఈ లేఖ రాశారు.రాష్ట్రంలో కొత్త కళాశాలలు, సీట్ల పెంపుకు సంబంధించిన అనుమతుల విధివిధానాలపై ఏఐసీటీఈ గత జనవరిలోనే హ్యాండ్ బుక్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అపరిమిత సీట్లు మంజూరు చేస్తామని అందులో స్పష్టం చేసింది. ఆ మేరకు సీట్లపెంపుకు దరఖాస్తు చేసుకున్న కళాశాలలకు ఏఐసీటీఈ అనుమతులిచ్చింది. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ ఏఐసీటీఈకి లేఖ రాయడంపై కళాశాలల యాజమాన్యాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. అనుమతుల ప్రక్రియ అంతా పూర్తయ్యాక లేఖ రాయడం ఏంటని ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్రంలో ఒకపక్క ఇంజినీరింగ్ కాలేజీల సంఖ్య భారీగా పెరగ్గా.. ఆ మేరకు సీట్ల సంఖ్య కూడా భారీగా పెరగనుంది. ముఖ్యంగా డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్, ఐటీ సంబంధిత బ్రాంచీల్లో ఏకంగా 20,500 సీట్లు పెరగనున్నాయి. అయితే పెరగిని ఈ సీట్లు కేవలం జేఎన్‌టీయూహెచ్ పరిధిలోని కళాశాలల్లోనివి మాత్రమే కావడం గమనార్హం. ఇక ఉస్మానియా యూనివర్సిటీ కాకతీయ యూనివర్సిటీల్లో కలిపితే సీట్ల సంఖ్య మరింత పెరుగుతాయి.రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ జులై 4న ప్రారంభమైన సంగతి తెలిసిందే. విద్యార్థులు జులై 12 వరకు నిర్ణీత ప్రాసెసింగ్ ఫీజు చెల్లించడానికి అవకాశం ఉంది. వీరికి జులై 6 నుంచి 13 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తయినవారు కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపిక కోసం జులై 8 నుంచి 15 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. వీరికి జులై 19న మొదటి దశ ఇంజినీరింగ్ సీట్లను కేటాయించనున్నారు. సీట్లు పొందినవారు జులై 19 నుంచి 23 మధ్య సంబంధిత కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. అయితే జులై 8 నుంచి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో జేఎన్‌టీయూహెచ్ పరిధిలో దాదాపు 88 వేల సీట్లకు అనుమతిచ్చినట్లు తెలుస్తోంది. అందులో ఇతర కోర్ బ్రాంచ్‌లలో సుమారు 7 వేల సీట్లను కుదించుకొని సీఎస్ఈ తదితర డిమాండ్ ఉన్న బ్రాంచీల్లో సీట్ల సంఖ్య పెంచుకున్నట్లు తెలుస్తోంది. బీటెక్ కోర్సుల్లో చేరేవారు మొదటి ఛాయిస్‌గా కంప్యూటర్ సైన్స్, ఐటీ సంబంధిత కోర్సులనే ఎంచుకుంటున్నారు. దీంతో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచీల్లో కన్వీనర్ కోటా సీట్లు సగం కూడా నిండలేదు. గతేడాది మూడు కోర్ బ్రాంచీల్లో 12,751 సీట్లుండగా.. అందులో కేవలం 5,838 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇక మేనేజ్‌మెంట్ కోటాలో చేరేవారే కరవయ్యారు. ఆ సీట్లను కూడా కలిపితే మొత్తం సీట్ల భర్తీ 40 శాతానికి

## మాయమవుతున్న చెరువులు...

**హైదరాబాద్, జులై 7 (ప్రజాస్వరం) :**
నిత్యం హైదరాబాద్ వార్తలలో చెరువు కబ్జాలు సాధారణమైపోయాయి. ఒక్క హైదరాబాద్ నగరమే అనుకుంటే పొరపాటు తెలంగాణవ్యాప్తంగా పలు నగరాలలో ఇదే పరిస్థితి. భౌగోళికంగా తెలంగాణ ప్రాంతం ఎత్తుగా ఉండటంతో ఇక్కడ మొదటి నుంచి వర్షాల మీదే ఆధారపడి జీవించేవారు. అందుకే వర్షపు నీటిని ఒడిసిపట్టి ఇతరత్రా అవసరాలకు యోగ్యమయ్యేలా చెరువులను ముందు చూపుతో అప్పటి రాజులు, నవాబులు తవ్వించారని చరిత్ర చెబుతోంది. మరి అలాంటి చెరువులన్నీ ఏమైయ్యాయి. ఏటా సమృద్ధిగా వర్షాలు పడుతున్నా చెరువులు తగ్గిపోవడంతో నీటి నిల్వలు కూడా తగ్గిపోవడం ఆరంభం అయింది. దీనికంతటికీ కారణం చెరువుల కబ్జాలే కారణం.టీ.సర్కార్ వెబ్ సైట్ ప్రకారం కేవలం 19 వేల 314 చెరువులకు సంబంధించిన సమాచారమే ఉంది. రాష్ట్రంలో కాకతీయుల కాలం నుంచి నిజాం రాజుల వరకు ఉన్న సుమారు లక్షన్నర చెరువులు తమ ఉనికిని కోల్పొయి, కాంక్రీట్ భవంతుల కింద మసకబారాయి. ప్రస్తుతం రాష్ట్రంలో చెరువులు కుంటలు కలిపి 46వేల 531 మాత్రమే ఉన్నాయి. 2015లో 46 వేల చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.22 వేల కోట్లు కేటాయించింది. మిషన్ కాకతీయ పథకం అమలు తీరు పక్కన పెడితే ప్రభుత్వం దగ్గర ఈ చెరువుల సమాచారం ఉండే అవకాశం ఉంది. ప్రతి చెరువుకు సంబంధించి ప్రస్తుత పరిస్థితి అంచనా వేయడానికి ఈ పట్టిక ఉంటే ఉపయోగపడుతుంది. 2021లో మీడియాలో వచ్చిన సమాచారం మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీర్- ఇన్- చీఫ్, చీఫ్ ఇంజినీర్ల ప్రాదేశిక పరిధులలో ఉన్న 43,870 చెరువులలో 21,552 చెరువులు అలుగులు పారినాయి, 13,451 చెరువులు 75 శాతం నుంచి 100 శాతం వరకు నిండమైంది. ఈ చెరువుల సమాచారం కూడా ప్రభుత్వం దగ్గర ఉన్నట్టు మనం భావించాలి. చెరువుల సంఖ్య ఎంత అనేది గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి కచ్చితమైన లెక్కలు లేవు అనేది స్పష్టం.అన్యాక్రాంతమవుతున్న చెరువుల పరిరక్షణకు ఎట్టకేలకు జీహెచ్ఎంసీ నడుం బిగించింది. గ్రేటర్ పరిధిలోని 185 చెరువుల పరిరక్షణకు ఇప్పటికే ఈవీడీఎం జవాన్లతో పహారా ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ చెరువుల పరిరక్షణతో పాటు ఇతర సేవలను కూడా పారదర్శకతతో అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తుంది. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా తొలుత 6 చెరువుల చుట్టూ ఏర్పాటు చేసిన మొత్తం 93 సీసీ కెమెరాల పహారా సరైన ఫలితాలిస్తుండటంతో మిగిలిన మొత్తం చెరువుల చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. పైగా వచ్చేవి చెరువులతో ముడిపడిన పండుగలు. వాటిలో ప్రధానమైనవి బోనాలు, వినాయకచవితి, బతుకమ్మ పండుగలు. వీటిని దృష్టిలో పెట్టుకుని జీహెచ్ ఎంసీ చెరువుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది.ఒక్కో చెరువు చుట్టూ ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్) కవరయ్యేలా ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. చెరువుల సైజును బట్టి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. అతిపెద్ద చెరువుగా చెప్పుకునే దుర్గం చెరువు చుట్టూ ఏకంగా 60 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ముఖ్యంగా చెరువు ఎంట్రెన్స్‌తో పాటు రాకపోకలు సాగించే వారితో పాటు అక్కడ విధులు నిర్వహిస్తున్న ఈవీడీఎం జవాన్ల పనితీరును కూడా ఈ సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు.

# ధరణి... మారని ధోరణి

**నిజామాబాద్, జులై 7 (ప్రజాస్వరం) :**
బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ధరణి అక్రమాల పుట్టగా తయారయింది. అందుకే కాంగ్రెస్ సర్కార్ ధరణి ప్రక్షాళన చేపట్టింది. అందులో భాగంగానే స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. అయితే భూ సమస్యలు పరిష్కరించేందుకు పారదర్శకంగా ధరణి పోర్టల్‌ను తీర్చిదిద్దినా ..వివిధ దశల్లో దరఖాస్తుల పరిశీలనలో జాప్యం జరగుతోంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే దాదాపు 61,019 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి. వరుస ఎన్నికలకు తోడు రెవెన్యూ అధికారుల బదిలీ, కొత్తగా వచ్చిన అధికారులు వీటి పరిష్కారానికి అంతగా ఆసక్తి చూపక పోవడంతో దరఖాస్తుల సంఖ్య పేరుకుపోయింది. కలెక్టర్లు లేదా ఇతర రెవెన్యూ అధికారులు మారితే చాలు.. ఫైల్స్ అన్నీ తిరిగి వెనక్కి పంపించేస్తున్నారు మరోపక్క ధరణి సమస్యలను పరిష్కరించాలని సమీక్షలు నిర్వహిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది.వ్యవసాయ భూముల రక్షణకు తీసుకువచ్చిన ధరణి చట్టం రైతుల పాలిట శాపంగా మారింది. అయితే ఇందులో మార్పులు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చట్టంలోనే కాదు దానిని అమలు చేసే అధికారుల్లో అక్రమార్కులు తయారయ్యారు. అందులోని లోసుగులను అనుకూలంగా మల్చుకొని రైతులను ముప్పు తిప్పలు పెడుతున్నారు ప్రతి స్లాట్ బుకింగ్ కు ఒక రేటుగా నిర్ణయించి కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా అధికారులు దండుకుంటున్నట్లు తెలిసింది. కిందిస్థాయి అధికారి నుంచి పై స్థాయి అధికారి వరకు పైసలిస్తేనే పనులు జరుగుతాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల వీణవంక రెవెన్యూ కార్యాలయంలో ఓ మహిళ అమెరికాలో ఉండగా ఆమెకు చెందిన 22 గంటల భూమిని ఫోర్జరీ చేసి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారని ధరణి ఆపరేటర్ భూమి కొనుగోలు చేసిన వ్యక్తితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు అయింది .ఈ విషయంలో తహశీసిల్దార్ తిరుమల రావు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ,ధరణి ఆపరేటర్ అరుణ్ లను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు.ధరణి సెక్షన్లో కొన్ని జిల్లాలలో అన్ని




రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల్లో రాజకీయ నేతలు, దళారులు, వ్యాపారులకు మాత్రమే పనులు సాఫీగా సాగుతున్నాయి. సామాన్యులకు చుక్కెదురే అవుతుంది. నెలల తరబడి తిరిగినా ఫైల్ కదడం లేదు. అసలు సమస్య ఏమిటో ఎవరు చెప్పరు. ఐదు గుంటల కోసం స్లాట్ బుక్ చేస్తే చేయరాదు అంటూ కొర్రీలు పెట్టి వారి దగ్గర డబ్బులు గుంజుతారు.కలెక్టర్లు లేదా ఇతర రెవెన్యూ అధికారులు మారితే చాలు.. ఫైల్స్ అన్నీ తిరిగి వెనక్కీ పంపించేస్తున్నారు. శాసన సభ ఎన్నికల సమయంలో కొన్ని జిల్లాలకు కలెక్టర్లు మారారు. కొత్త కలెక్టర్ వచ్చినప్పుడల్లా ధరణి దరఖాస్తులను తిరిగి వెనక్కీ పంపించేస్తుంటారు. అలాగే రెవెన్యూ ఉన్నతాధికారులు మారినప్పుడు కూడా ఇలానే జరుగుతోంది. ఇప్పటి వరకూ కలెక్టర్లు మారినప్పుడల్లా ఫైల్స్ తిరిగి పంపిండంతో తహసీల్దారు స్థాయిలో ధరణి దరఖాస్తులు పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉన్నట్లు కనిపిస్తున్నాయి.తెలంగాణ పరిధిలో అనేక జిల్లాలలో వేలసంఖ్యలో భూ సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. ఈ క్రమంలో ధరణి దరఖాస్తుల అమోదం, తిరస్కరణలకు సంబంధించి కలెక్టర్లకు మాత్రమే ఉన్న అధికారాలను విభజించారు. మండలాల వారీగా స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి తహసీల్దార్లు నాలుగు రకాల మాడ్యుళ్లకు సంబంధించిన దరఖాస్తులు పరిష్కరిస్తున్నారు. అసైన్డ్ భూములతో పాటు అన్ని రకాల వారసత్వ బదిలీ ప్రక్రియలు, భూ సమస్యలకు సంబంధించిన వినతులు, తదితర సమస్యలను తహసీల్దార్లు పరిశీలించనున్నారు. మరికొన్ని సమస్యలను ఆర్డీవో పరిష్కరించనున్నారు. ధరణిలో తప్పొప్పుల సవరణ, నిషేధిత జాబితా, దస్త్రాల ఆధునికీకరణ తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను మండల, జిల్లా స్థాయిలోనే పరిష్కరించేలా అదేశాలిచ్చినా ఫలితం లేకుండా పోతుంది.

## ఏపీలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం...

**విజయవాడ, జులై 7 (ప్రజాస్వరం) :**
ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు నెల రోజులు పూర్తి కావొస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగానే సూపర్ సిక్స్ పథకాల అమలు సహా పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులు ఆకర్షణ వంటి అంశాలపై ఎక్కువగా ఫోకస్ పెట్టింది. ఇప్పటికే డీఎస్సీ ఉద్యోగాల భర్తీ, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, నైపుణ్య గణన వంటి హామీలు నెరవేర్చారు. సీఎం చంద్రబాబు అందుకు అనుగుణంగా ఆదేశాలిచ్చారు. జులై 1 నుంచి పెరిగిన పింఛన్ రూ.1000తో పాటు ఏప్రిల్ నుంచి ఎరియర్లతో కలిపి ఒకేసారి రూ.7 వేలను లబ్ధిదారులకు అందించారు. ఇక మిగిలిన హామీల అమలుపైనా ప్రభుత్వం దృష్టి సారించారు.ఏపీ ప్రభుత్వం రైతుల కోసం ఃఅన్నదాత సుఖీభవః పథకం అందుబాటులోకి తీసుకురానుంది. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు అందించిన ఃవైఎస్ఆర్ రైతు భరోసాః పథకానికి పేరు మారుస్తూ ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఈ పథకం కింద ప్రతీ రైతుకు ఏడాదికి రూ.20 వేలు అందించనుంది. గత ప్రభుత్వం ప్రతీ రైతుకు సంవత్సరానికి రూ.13,500 చొప్పున ఇచ్చింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.6 వేలు కలిపే ఉండేది. కూటమి ప్రభుత్వం ఆ సాయాన్ని రూ.20 వేలకు పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, పీఎం కిసాన్ నిధులు రూ.6000 చొప్పున మొత్తాన్ని అన్నదాతలకు అందించనుంది. ఏడాదికి 3 విడతల్లో పెట్టుబడి సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. దీని ప్రకారం రెండు విడతల్లో రూ.5 వేలు, మూడో విడతలో రూ.4 వేలు ఇచ్చే అవకాశం ఉంది. ఃఅన్నదాత సుఖీభవః పథకం కోసం త్వరలోనే ఓ పోర్టల్ సైతం అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది.ఈ పథకం పొందేందుకు అర్హతలపై ఎలాంటి అధికారిక సమాచారం లేకపోయినప్పటికీ.. ప్రభుత్వ వర్గాల అంచనా ఏపీకి చెందిన రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులుగా తెలుస్తోంది. కుటుంబంలో ఒక్కరు మాత్రమే ఈ పథకం కింద లబ్ధి పొందే ఛాన్స్ ఉంటుందని సమాచారం. అలాగే, కుటుంబంలో ఎవరూ ట్యాక్స్ చెల్లించేంత ఆర్థిక స్తోమత కలిగి ఉండకూడదు. అలాగే, రైతులు ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, భూమి పత్రాలు, ల్యాండ్ పాస్ బుక్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నెంబర్, బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఈ - మెయిల్ ఐడీ కలిగి ఉండాలని పేర్కొంటున్నారు.అనంతరం, త్వరలోనే ఈ పథకానికి సంబంధించిన పోర్టల్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది. అందులో వివరాలు నమోదు చేసిన తర్వాత ధ్రువపత్రాలను అప్ లోడ్ చేసి సబ్మిట్ చేయాలి. అనంతరం దీనికి సంబంధించిన అప్లికేషన్ ప్రింట్ అవుట్ తీసి భద్రపరుచుకోవాలి. త్వరలోనే ఈ పథకానికి సంబంధించిన విధి విధానాలు, మార్గదర్శకాలు అధికారికంగా విడుదల చేసే అవకాశం ఉంది.

## టీటీడీ ఛైర్మన్ పదవి ఎవరికి...





**తిరుమల, జులై 7 (ప్రజాస్వరం) :**

చంద్రబాబు దూకుడు మీద ఉన్నారు. పాలనాపరమైన నిర్ణయాలను శరవేగంగా తీసుకుంటున్నారు. నూతన నియామకాలను చేపడుతున్నారు. ఈ తరుణంలో టీటీడీ ఛైర్మన్ పదవిని భర్తీ చేయాలని భావిస్తున్నారు. రకరకాల పేర్లు తెరపైకి వస్తున్నాయి. తొలుత మెగా బ్రదర్ నాగబాబు పేరు బలంగా వినిపించింది. కానీ ఆయన పెద్దగా ఆసక్తి చూపలేదని టాక్ నడిచింది. అయితే చంద్రబాబు ఫైనలైజ్ చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. చివరికి రేసులో టీవీ5 అధినేత బిఆర్ నాయుడు, టిడిపి సీనియర్ నేత అశోక్ గజపతి రాజు ఉన్నట్లు సమాచారం. ఈ ఇద్దరిలో ఒకరికి ఛైర్మన్ పదవి ఖాయం చేస్తారని తెలుస్తోంది. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో టీటీడీ ఛైర్మన్ పదవికి భూమన కరుణాకర్ రెడ్డి రాజీనామా చేశారు. దీంతో అధ్యక్ష పదవి భర్తీ చేయాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది.తెలుగుదేశం పార్టీకి బలమైన మీడియా సపోర్ట్ గా టీవీ5 ఛానల్ నిలిచింది. అధినేత బిఆర్ నాయుడు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. ఇప్పటివరకు ఆ సామాజిక వర్గానికి టీటీడీ ఛైర్మన్ పదవి దక్కలేదు. అందుకే ఆ సామాజిక వర్గానికి కేటాయించాలని చంద్రబాబుపై ఒత్తిడి పెరుగుతోంది. అయితే నిన్నటి వరకు రెడ్డి సామాజిక వర్గానికి అధ్యక్ష పదవి ఇచ్చారని వైసీపీ పై ఒక రకమైన ప్రచారం నడిచింది. బి ఆర్ నాయుడుకు టీటీడీ ఛైర్మన్ పదవి అప్పగిస్తే కమ్మ సామాజిక వర్గానికి పదవులంటూ వైసీపీ ప్రచారం ప్రారంభించే అవకాశం ఉంది. అందుకే బిసి నినాదం తెరపైకి వస్తోంది. కానీ ఇటీవలే టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీ వర్గానికి చెందిన పల్లా శ్రీనివాస్ కు అప్పగించారు. అందుకే టీటీడీ అధ్యక్ష పదవిని కమ్మ సామాజిక వర్గానికి కేటాయిస్తారని సమాచారం.మరోవైపు అశోక్ గజపతిరాజు పేరు కూడా వినిపిస్తోంది.క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు టీటీడీ అధ్యక్ష పదవి ఇవ్వడం సముచితమని, హుందాతనమని, గౌరవించినట్లు అవుతుందని పార్టీ వర్గాల్లో ఒక రకమైన అభిప్రాయం ఉంది. ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. ఆయన కుమార్తె అదితి గజపతిరాజు విజయనగరం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పటి వరకు టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రతిసారి అశోక్ రాష్ట్ర క్యాబినెట్లో చోటు దక్కడం ఆనవాయితీగా వస్తోంది. 2014లో మాత్రం ఆయన ఎంపీగా పోటీ చేయడంతో ఎన్డీఏ ప్రభుత్వంలో పౌరవిమానయాన శాఖ దక్కింది. ఆయనకు కీలక పదవి ఇవ్వనున్న నేపథ్యంలోనే ఆయన కుమార్తెకు క్యాబినెట్లోకి తీసుకోలేదని ప్రచారం జరుగుతోంది. పైగా గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ సర్కార్ హయాంలో అశోక్ గజపతిరాజు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో కీలక దేవస్థానాలకు ధర్మకర్తగా ఉండడంతో.. ఆయనకు టిటిడి అధ్యక్ష పదవి ఇస్తే సముచితమని పార్టీ వర్గాల్లో ఒక రకమైన అభిప్రాయం ఉంది. మరి చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

**తెరపైకి అశోకగజపతి రాజు**
ఏపీలో టీటీడీ ఛైర్మన్ పదవి మరోసారి తెరపైకి వచ్చింది. సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ నడుస్తోంది. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు, ఓ సీనియర్ నేతకు ఆ పదవి ఆఫర్ చేసినట్లు సమాచారం. తెలుగుదేశంలో కూడా బలమైన చర్చ నడుస్తోంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మెగా బ్రదర్ నాగబాబు పేరు బలంగా వినిపించింది. ఆయనను టీటీడీ అధ్యక్షుడిగా నియమిస్తారని ప్రచారం జరిగింది. అయితే ఆయన పదవిపై ఆసక్తి చూపలేదని టాక్ నడిచింది. ఈసారి టిడిపి సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజుకు టీటీడీ అధ్యక్ష పదవి ఇస్తారని ఒక ప్రచారం అయితే ఊపందుకుంది. కానీ ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం, మంత్రులు, శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం సైతం ముగిసింది. స్పీకర్ ఎంపిక పూర్తి చేసి ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. మరోవైపు కొత్త ప్రభుత్వం నూతన నియామకాలతో పాటు పాలనపై దృష్టి పెట్టింది. అటు నామినేటెడ్ పోస్టుల విషయంలో సైతం చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేశారు. కష్టపడిన వారికి పదవులు ఇస్తామని.. ఇప్పటికే కసరత్తు చేస్తున్నట్లు కూడా ప్రకటించారు.ఈ నేపథ్యంలోనే టీటీడీ అధ్యక్ష పదవివిషయంలో ఒక క్లారిటీ వచ్చిందని.. సీనియర్ నేత అశోక్ గజపతి రాజుకు ఆ పదవి ఖాయమైందని సోషల్ మీడియాలో ఉధృతంగా ప్రచారం జరుగుతోంది.అశోక్ గజపతిరాజు టిడిపిలో సీనియర్.పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు సైతం పక్క చూపులు చూడలేదు. ఇప్పటివరకు ఆయన ఏడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రతిసారి రాష్ట్ర క్యాబినెట్లో ఆయనకు చోటు దక్కింది. ఒకసారి ఎంపీ అయిన ఆయన కేంద్ర మంత్రిగా కూడా వ్యవహరించారు. 2014 యండి ఏ ప్రభుత్వంలో పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేశారు. 2019 ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి ప్రత్యక్ష రాజకీయాలనుంచి తప్పుకొని తన కుమార్తె అదితి గజపతిరాజుకు ఛాన్స్ ఇచ్చారు. ఎన్నికల్లో ఆమె భారీ మెజారిటీతో గెలుపొందింది.2024 ఎన్నికల తర్వాత అశోక్ గజపతిరాజు గవర్నర్ గా నియమిస్తారని ప్రచారం జరిగింది. ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉండడంతో.. తెలుగుదేశం పార్టీకి బిజెపి రెండు గవర్నర్ పోస్టులు ఆఫర్ చేసిందని జోరుగా ప్రచారం సాగింది. కానీ అటు తర్వాత ఎలాంటి క్లారిటీ లేదు. ఇప్పుడు టీటీడీ ఛైర్మన్ గా అశోక్ గజపతిరాజు పేరు బలంగా వినిపిస్తోంది. కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన లేదు. విజయనగరం సంస్థానానికి వారసుడిగా, సింహాచలంతో పాటు రామతీర్థ ఆలయ ట్రస్టీగా అశోక్ గజపతిరాజు ఉన్నారు. మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ గా కూడా కొనసాగుతున్నారు. రాజకీయాల్లో హుందాగా ఉంటారని ఆయనకు మంచి పేరు ఉంది. గత ఐదేళ్ల కాలంగా అశోక్ గజపతి రాజును వైసీపీ ప్రభుత్వం టార్గెట్ చేసుకుంది. అందుకే ఈసారి టీటీడీ ఛైర్మన్ గా అవకాశం ఇచ్చి.. ఆయన గౌరవాన్ని పెంచాలని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. మరి అందులో ఎంతవరకు వాస్తవం ఉందో చూడాలి.

## వీధి కుక్కల స్వైర విహారం...

**హైదరాబాద్, జులై 7 (ప్రజాస్వరం) :**
రాష్ట్రంలో వీధికుక్కలు దాడులు ఆగడం లేదు. నగరాలతో పాటు పల్లెల్లో కూడా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రతిరోజు ఏదో ఒక చోట వీధి కుక్కల బారిన పడి గాయపడిన సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. కాగా సంగారెడ్డి జిల్లా పటాన్ చెరులో ఒక్క జూన్ నెలలోనే 96 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. అంటే కుక్కల బెడద ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. ఈ కుక్కల దాడిలో చిన్న పిల్లలే కాకుండా మూగ జీవాలను సైతం వదలట్లేదని రైతులు వాపోతున్నారు. జూన్ 28 శుక్రవారం రోజు పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ లో వీధి కుక్కల గుంపు దాడిలో ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. మరో ఘటన ముత్తంగి గ్రామంలో 8 నెలల పసికందుపై కుక్క దాడి చేసింది. దీంతో ఆ చిన్నారి నీలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. కాగా శుక్రవారం ఒక్కరోజే పటాన్ చెరు మండలంలో ఐదు వీధికుక్క కాటు కేసులు నమోదయ్యాయని పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ ప్రవీణ్ తెలిపారు. జూన్ 1 నుంచి 28 వరకు 96 వీధి కుక్కల దాడి కేసులు నమోదయ్యాయని, ఒక్క పటాన్ చెరు మండలంలోనే రోజుకు ముగ్గురికి పైగా వీధి కుక్కల కాటుకు గురవుతున్నారని ఆర్ఎంఓ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన కేసులే నమోదయ్యాయని, ఇంకా చాలామంది బాధితులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో, ఇతర ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కావున ఆ కేసులన్నీ నమోదైతే సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ బాధితుల్లో ఎక్కువ మంది చిన్నారులేనని అయన పేర్కొన్నారు.ఈ క్రమంలో చిన్నారులను బయటకు పంపించాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. వీధులలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ పిల్లలు, మహిళలతో పాటు ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని కూడా వెంబడిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. దీంతో పాటు ఈ దాడులలో మూగ జీవాలు మేకలు, గొర్రెల సైతం ప్రాణాలు కోల్పోతున్నాయి. శనివారం చిన్న కోడూరు మండలం గోనెపల్లిలో ఓ రైతుకు సంబంధించిన గొర్రెల మందపై కుక్కల గుంపు దాడి చేయగా 14 గొర్రె పిల్లలు మృతి చెందాయి. కాగా సుమారు రూ. 50 వేల నష్టం వాటిల్లిందని రైతు వాపోతున్నారు.ప్రతిరోజు మాంసం దుకాణాలలో వెలువడే మాంసం వ్యర్థాలను దుకాణదారులు నిర్లక్ష్యంతో ఎక్కడ పడితే అక్కడే పడేస్తున్నారు. దీంతో వీధి కుక్కలు మాంసం వ్యర్థాలను తినడానికి అలవాటు పడుతున్నాయి. మాంసం వ్యర్థాలు దొరక్కపోతే అవి క్రూరంగా మారి చిన్న పిల్లలు, మేకలు, గొర్రెలపై ఇష్టం వచ్చినట్లు దాడులు చేస్తున్నాయి. దీంతో పిల్లలు, వృద్ధులు, గ్రామాలల్లో ఒంటరిగా తిరగాలంటేనే భయాందోళన చెందుతున్నారు. ఆయా ప్రాథమిక కేంద్రాలలో వందల సంఖ్యలో కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వీధి కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు కోరుతున్నారు. జనన నియంత్రణ చర్యలు లేకపోవడంతో వీధి కుక్కల సంఖ్య పెరుగుతుందన్నారు.

**కుక్క కాటు జాగ్రత్తలు-సూచనలు**

కుక్క కరిచిన వ్యక్తి ఐదు సార్లు వ్యాక్సిన్ తీసుకోవాలి.

కుక్క కరిచిన రోజు, మూడో రోజు, ఏడో రోజు, 14వ రోజు, 28వ రోజు రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలి.

కుక్క కరిచిన ప్రాంతంలో రక్తస్రావం అయితే ఈ వ్యాక్సిన్ తో పాటు రెండు రోజుల లోపు ఇమ్యూనోగ్లోబిలిన్ ఇంజెక్షన్ ను కరిచినా చోట తీసుకోవాలి.

ఈ ఇంజెక్షన్ శరీరానికి ఇమిడియట్ బస్టర్ లా పనిచేస్తుంది. దీనివల్ల రేబిస్ వ్యాధి సోకకుండా ఉంటుంది.

రేబిస్ వ్యాధి సోకితే ప్రపంచంలో ఎక్కడ ట్రీట్మెంట్ లేదని వైద్యులు తెలిపారు

# నిజాలు బయటపెట్టిన లావణ్య..!

హీరో రాజ్‌తరుణ్ పేరు ఈరోజున తెగ వైరల్ గా మారుతోంది. అనుకోకుండా వివాదంలో చిక్కుకున్నాడు.ముఖ్యంగా రాజ్ తరుణ్ లావణ్య అనే అమ్మాయిని ప్రేమించి మోసం చేశాడని ఆమె ఫిర్యాదు చేయడంతో ఒక్కసారిగా రాజ్ తరుణ్ పేరు తెరమీదకి వచ్చింది. లావణ్యతో 11 ఏళ్లుగా సహజీవనం చేస్తున్నారని వీరిద్దరూ ఒకే ఇంట్లో ఉంటున్నారని ఇద్దరి మధ్య శారీరక సంబంధం ఏర్పడి గుడిలో లావణ్యను వివాహం చేసుకున్నారని.. అయితే మూడు నెలల తర్వాత తనను వదిలేసారని రాజు తరుణ్ పైన లావణ్య కేసు పెట్టడం జరిగింది. అయితే లావణ్యను రాజ్ తరుణ్ వదిలేయడానికి ముఖ్య కారణం ఒక హీరోయిన్ తో ఎఫైర్ అన్నట్లుగా తెలియజేసింది. ముఖ్యంగా ఆ హీరోయిన్ తో ఎఫైర్ వల్లే లావణ్యను దూరం పెడుతూ వస్తున్నారని తనని వదిలేయకపోతే చంపేస్తానంటూ బెదిరించాడని కూడా తెలిపింది. గతంలో కావాలని లావణ్యను డ్రగ్స్ కేసులో ఇరికించాడని దాదాపుగా లావణ్య 45 రోజుల పాటు జైల్లో ఉన్నట్లుగా తెలిపింది. తనకు మాత్రం రాజ్ తరుణే కావాలి అంటూ లావణ్య న్యాయం చేయాలని పోలీసులను సైతం ఆశ్రయించారు. ఈ విషయం పైన రాజ్ తరుణ్ స్పందిస్తే లావణ్యతో తను రిలేషన్ లో ఉన్న మాట నిజమే కానీ తామిద్దరి మధ్య ఎలాంటి శారీరక సంబంధం లేదని ఆమెను పెళ్లి చేసుకోలేదని తెలిపారు. గతంలో చాలా మంచి అమ్మాయి తన స్నేహితుల వల్ల ఆమె డ్రగ్స్కు కూడా అలవాటు పడిపోయింది అంటూ తెలిపారు. ఇదంతా ఇలా ఉండేవా తాజాగా లావణ్య ఒక ఆడియో కాల్ రికార్డును సైతం మీడియాకు లీక్ చేసినట్లుగా సమాచారం.



# రానా దగ్గుపాటి కామెంట్స్..!



రానా దగ్గుపాటి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈయన ఎన్నో సినిమాల్లో రాణిస్తూ ప్రేక్షకుల్ని బాగా కట్టుకున్నారు. 35 చిన్న కథ కాదు సినిమా స్టోరీ వింటే తనకోసం వాళ్ళ అమ్మ పడిన కష్టమే గుర్తుకు వచ్చిందని రానా దగ్గుపాటి చెప్పారు.నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్ లో నటించిన న్యూ ఎజ్ క్లీన్ ఎంటర్ డైనర్ మూవీ "35 చిన్న కథ కాదు. సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్ , వాల్టెయిర్ ప్రొడక్షన్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, సృజన్ యర బోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి ఈ చిత్రాని నిర్మిస్తున్నారు.ఈ మూవీకి నంద కిషోర్ ఈ మాని కదా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా 35 చిన్న కథ కాదు మూవీ టీజర్ ని విడుదల చేసి మేకర్స్ ప్రమోషన్స్ ప్రారంభించారు. గురువారం 35 సినిమా టీజర్ విడుదల చేస్తూ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో, నిర్మాతరానా దగ్గుపాటి ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పుకొచ్చారు. "స్కూల్ లో ఉన్నప్పుడు 35 అనేది నాకు పెద్ద పర్వతం లాంటిది. నందు ఈ కథ చెప్పినప్పుడు నాకు నేను గుర్తుకు వచ్చాను, మా అమ్మ గుర్తుకొచ్చింది. నాకోసం మా అమ్మ పడినా కష్టం గుర్తుకు వచ్చింది. ఈ కథ వెళ్ల మా అమ్మకు చెప్పాను. ఇది మన అందరి కథ. చాలామంది లైఫ్ ఇలా ఉంటుంది. ఈ కథని అందరూ రిలేట్ చేసుకుంటారు" అని రానా దగ్గుబాటి చెప్పారు. "చాలా కమర్షియల్ సినిమాలు వస్తుంటాయి. కానీ, ఇలాంటి ప్యూర్ హర్ట్ వార్మింగ్ స్టోరీలు రావడం చాలా అరుదు. ఇలాంటి మంచి కథలు సురేష్ ప్రొడక్షన్ లో చేయాలనేది మా ఉద్దేశం.

# ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్

సాయికుమార్ మరో ఫెరోషియస్ పాత్రతో ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చెయ్యబోతున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'ప్రణయగోదారి'. ఇందులో పెదకాపు అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారు. పిఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో హాస్యనటుడు అలీ కుటుంబానికి చెందిన సదన్ హీరోగా నటిస్తున్నారు. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తోంది. సునీల్ రావినూతల ముఖ్య పాత్రలో నటిసున్నారు. పిఎల్‌వి క్రియేషన్స్‌పై పారమళ్ళ లింగయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సాయికుమార్ లుక్ పోస్టర్‌ను శుక్రవారం తెలంగాణ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మా మునుగోడు ప్రాంతానికి చెందిన పారుమళ్ళ లింగయ్య ఇలాంటి మంచి సినిమాను నిర్మించినందుకు అభినందనలు. ఆయనకు నా సహకారం ఎప్పుడూ ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణతో మంచి విజయం సాధించాలని ఆశిస్తున్నాను' అని అన్నారు. దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, 'ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా అన్ని వర్గాల వారిని అలరిస్తుంది. టైటిల్‌కి తగ్గట్టుగా నేచురల్ లొకేషన్స్‌లో చిత్రీకరణ చేస్తున్నాం. గోదారి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానాలు చిత్రంలో కనిపిస్తాయి. అతి త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పారు.




# హాస్యభరిత వ్యంగ్య చిత్రం

టైటిల్‌తోనే అందరినీ ఆకర్షిస్తోన్న సెటైరికల్ ఫన్నీ ఎంటర్టైనర్ 'పైలం పిలగా'. వ్యవసాయం చేస్తే కడుపు నిండుతుంది కానీ కోట్లు కూడబెట్టలేమని బలంగా నమ్మిన ఓ యువకుడికి అనుకోకుండా సొంతూళ్లోనే కోట్ల రూపాయల బిజినెస్ చేసుకునే అవకాశం దొరుకుతుంది. కానీ పద్మవ్యూహం లాంటి బ్యూరోక్రసీ వలలో చిక్కుకుని ఎలాంటి అవస్థలు పడ్డాడు?, చివరకు ఏం చేసాడు? తెలంగాణ నేపథ్యంలో సాగే హాస్యభరిత వ్యంగ్య చిత్రమిది. 'పిల్లా పిలగాడు' వెబ్ సిరీస్ ఫేమ్ సాయి తేజ కల్వకోట, పుష్పా సినిమా ఫేమ్ పావని కరణం జంటగా నటించారు. అగ్రతారలతో 100కి పైగా యాడ్ ఫిల్మ్ చేసిన ఆనంద్ గుర్రం దర్శకత్వంలో ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమాలోని 'సోడు సోడు నొక్కమే నీ సోకు' అనే పాటను డైరెక్టర్ శేఖర్ కమ్ముల రిలీజ్ చేశారు. ఎన్నో సెన్సేషనల్ సాంగ్స్ అందించిన యశ్వంత్ నాగ్, రామ్ మిర్యాల, ఆనంద్ గుర్రం కాంబినేషన్‌లో వస్తోన్న ఈ పాట గురించి డైరెక్టర్ శేఖర్ కమ్ముల మాట్లాడుతూ,'మంచి సాహిత్యానికి మంచి ట్యూన్ తోడైతే ఆ పాటలు ఎవర్ గ్రీన్‌గా నిలిచిపోతాయి. అలాంటి మంచి పాటల్లో ఈ పాట కచ్చితంగా ఉంటుందని ఆశిస్తున్నాను. పాటతో పాటు సినిమా కూడా విజయవంతం కావాలని కోరుకుకుంటున్నా' అని అన్నారు. 'కంటెంట్ ఓరియెంటెడ్ కాన్సెప్ట్‌తో వస్తున్న మమ్మల్ని ప్రోత్సహిస్తున్న శేఖర్ కమ్ములకి ధన్యవాదాలు' అని ప్రొడ్యూసర్ రామకృష్ణ బొదుల చెప్పారు. హ్యాపీ హార్స్ ఫిలిమ్స్ బ్యానర్ పై రామకృష్ణబొద్దుల, ఎస్.కే.శ్రీనివాస్ ఈచిత్రాన్ని నిర్మించారు.



# విశ్వక్సేన్ కామెంట్స్..!



మాస్ కా దాస్ గా పాపులారిటీ సంపాదించుకున్న హీరో విశ్వక్సేన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. అతి తక్కువ సమయంలోనే మాస్ ఇమేజ్ ని తన సొంతం చేసుకున్నాడు విశ్వక్సేన్.ప్రస్తుతం టాలీవుడ్ లో స్టార్ హీరోగా గుర్తింపు పొందాడు. ఇక తాజాగా తన కొత్త సినిమా లైలా కార్యక్రమాలతో ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో విశ్వక్ తొలిసారి ఓ లేడీ గెటప్ లో కనిపించాడు. దీంతో ఈ మూవీలో ఆయన లుక్స్ పరంగా ఎలా ఉండబోతున్నాడనే అంచనాలు భారీగా ఉన్నాయి. అయితే రీసెంట్ గా విశ్వక్ తన ఇన్స్టాగ్రామ్ అకౌంట్ ను డియాక్టివేట్ చేశాడు. ఆయన ఇన్స్టాగ్రామ్ అకౌంట్ ఎందుకు ఇలా చేశాడు అని అభిమానులు ఆందోళన పడుతున్నారు. ఇక ఈ క్రమంలో తన అభిమానులకి ఓ క్లారిటీ ఇచ్చాడు. ఈ యంగ్ హీరో. " గత కొద్ది రోజులుగా నా %ఱఅర్ఘ్తుత్రీఘుఎ% అకౌంట్ ను ఎందుకు? డియాక్టివేట్ చేశాను అని అభిమానుల నుంచి వరుసగా మెసేజ్లు వచ్చాయి. నేను కొద్ది రోజులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. నాకు ఏదో హాని జరుగుతుందని ఈ నిర్ణయం తీసుకోవడం లేదు. ఇందులో భాగంగా నా ఇన్స్టాగ్రామ్ ను డియాక్టివేట్ చేశాను. నా ట్విట్టర్ హ్యాండిల్ ని కూడా నా టీం మేనేజ్ చేస్తుంది. సోషల్ మీడియాలో ఉంటేనే జీవితం ముందుకు సాగుతుందని కాదు . అందుకే ఈ సోషల్ మీడియాను కొంతవరకే సీరియస్ గా తీసుకోండి . నేను నా నెక్స్ట్ మూవీ రిలీజ్ తరువాత తిరిగి సోషల్ మీడియాలోకి రావచ్చు . రాకపోవచ్చు " అంటూ విశ్వక్సేన్ క్లారిటీ ఇచ్చాడు . ప్రజెంట్ విశ్వక్ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది . ఏదేమైనాప్పటికీ విశ్వక్సేన్ పెద్ద డెసిషన్ తీసుకున్నాడని చెప్పుకోవచ్చు .

Edited, Printed, Published and Owned by Puram Maheshwar, Printed at Hari Hara Art Printers, H.No.6-1,85, Toopran, Medak (Dist) Telanagana 502336. Published at H.No. 4-50/18, Kallakal (Vill), Kallakal (Po), Manoharabad (M), Medak (Dist), Telangana 502336. Editor Puram Maheshwar. RNI No. TELTEL/2006/17154